



రంగులద్ది.. అందంగా తీర్చిదిద్ది..

'మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి'.. ఆ పేరు ఎత్తితేనే స్థానిక ప్రజలకు వైకాపా ప్రభుత్వ హయాంలో చూపించిన నరకం కళ్ల ముందు మెదులుతుంది. ఒక ఆర్‌యూబీ నిర్మాణానికి ఐదేళ్ల కాలం సరిపోక ఎన్నికల ముందు అసంపూర్తి పనులతోనే ఆదరాబాదరాగా వైకాపా నేతలు ప్రారంభించారు. తెదేపా ప్రభుత్వం వచ్చాక సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ఆర్‌యూబీకి అందంగా రంగులు వేసి ఇలా తీర్చిదిద్దారు. ఇప్పుడు మధురానగర్, దేవీనగర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బీఆర్టీఎస్ రోడ్డు వైపు వెళ్లేందుకు హాయిగా ఉందని వాహన చోదకులు, స్థానికులు చెబుతున్నారు.

– ఈనాడు, అమరావతి

చెదిరిన మోముపై.. చంద్రహాసం..

- ముంపు పరిహారం అందుకున్న లబ్ధిదారులు
- ఆర్థికంగా కోలుకునేందుకు ప్రభుత్వం వెన్నుదన్ను

ఈనాడు, అమరావతి
– ఈనాడు డిజిటల్, అమరావతి

"విజయవాడ వరద ప్రభావిత ప్రాంత బాధితులకు ప్రభుత్వ సాయం ఖాతాల్లో జమ అయింది. నగరంలోని సింగ్‌నగర్ సహా బుడమేరు ముంపు బాధిత ప్రాంతాల్లో ఉండే.. 78,558 ఇళ్లు నీట మునిగినట్లు గుర్తించి పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో 64,799 మంది గ్రౌండ్‌ఫ్లోర్‌లో వాళ్లకు రూ. 25 వేల చొప్పున రూ. 161.99 కోట్లు, మొదటి, ఆపైన ఉండే 13,759 ఇళ్లకు రూ. 13.76 కోట్ల పరిహారం విడుదల చేశారు. ప్రస్తుతం ఆ డబ్బులు బాధితుల బ్యాంకు ఖాతాల్లో గురువారం నుంచి జమ అవుతున్నాయి. వీటితోపాటు చనిపోయిన వాళ్ల కుటుంబాలు, పశు సంపద నష్టం, పాడైపోయిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, తోపుడు బళ్లు, కిరాణా దుకాణాలు, హోటళ్లు, చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు కూడా నష్ట పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది."

విజయవాడలో బుడమేరు ముంపు బారినపడి గుడిసె నుంచి బంగ్లా దాకా ప్రతి ఇల్లు నీట మునిగి ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది. గృహోపకరణాలు, వాహనాలు, వ్యాపార సముదాయాలు అన్నింటికి కోలుకోలేని దెబ్బతగిలింది. బాధితుల కన్నీరు తుడిచేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంది. వివిధ జిల్లాల నుంచి యంత్రాగాన్ని విజయవాడకు రప్పించి.. సహాయ చర్యలు చేపట్టింది. బాధితులకు అండగా నిలిచింది. వరద తగ్గిన 15 రోజుల్లోనే నష్టాన్ని సైతం యుద్ధప్రాతిపదికన అంచనా వేశారు. వరదతో నష్టపోయిన వారికి గతంలో ఎన్నడు లేనివిధంగా పరిహారాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడమే కాకుండా.. చేసి చూపించారు. స్వయంగా విజయవాడ కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి మరీ. . వరద బాధితులకు నష్టపరిహారాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ పరిహారం బాధితులు బ్యాంకు ఖాతాల్లో గురువారం ఉదయం నుంచి పడడం ఆరంభమైంది. తొలుత ఇళ్లు మునిగిన వారికి పరిహారం బ్యాంకు ఖాతాల్లో గురువారం పడ్డాయి. మిగతా వారికి కూడా ఒక్కొక్కరిగా.. పడుతున్నాయి. తాము ఇంత త్వరగా ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని అనుకోలేదని ముంపు ప్రాంత బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





ప్రభుత్వ సాయాన్ని మరువలేం

– సౌందర్య, ఆంధ్రప్రభకాలనీ



వరద తీవ్రతకు మా ఇల్లు, దుకాణం నీట మునిగాయి. త్వరగా ప్రభుత్వం సాయం అందించడం ఆనందంగా ఉంది. రూ. 25 వేలు గురువారం పడ్డాయి. ఈ డబ్బులతో ఇంట్లో పాడైన.. వస్తువులను సమకూర్చుకుంటాం. మా దుకాణానికి కూడా పరిహారం వస్తుందని చెప్పారు. ఆపద సమయంలో ప్రభుత్వం ఆదుకోవడాన్ని మేం ఎప్పటికీ మరచిపోలేం.

ప్రభుత్వ సాయంతోనే కోలుకుంటున్నాం

– మహేశ్వరి, పైపుల రోడ్డు



పండగ సీజన్ కావడంతో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం. వరద ముంచెత్తి ఇంట్లో గృహోపకరణాలతో పాటు.. అంగడిలో సరకులు నీట మునిగాయి. ప్రభుత్వం స్పందించి రూ. 25 వేలు ఖతాలో వేసింది. అంగడికి కూడా వేస్తామని చెప్పారు. వాటితో అప్పులకు వడ్డీలు కడతాం. వరద వల్ల సర్వం కోల్పోయాం. ప్రభుత్వ సాయంతోనే కోలుకోగలుగుతున్నాం.

ఇంటికి, ఆటోకి రూ.35 వేలు పడ్డాయి..

వరద వచ్చి నానా ఇబ్బందులు పడ్డాం. మొదట రెండు రోజులు ఆహారం కూడా అందకపోతే ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంది. మూడో రోజు నుంచి ఇంటింటికి ఆహారం అందించారు. వరద తగ్గగానే సర్వే చేసి.. అనుకున్నదాని కంటే వేగంగా డబ్బులను మా ఖాతాల్లో వేస్తున్నారు. ఇంటికి రూ.25 వేలు.. ఆటోకి రూ.10 వేలు పడ్డాయి. వీటితో ఇంట్లో పాడయిన గృహోపకరణాలు, ఇతర వస్తువులు సమకూర్చుకుంటాం. ఆటో కూడా మరమ్మతులు చేయించుకుంటాం. **- కట్ట సాయిదుర్గ, కొత్త రాజరాజేశ్వరిపేట**



చంద్రబాబు.. దేవుడిలా ఆదుకున్నారు




ఇల్లు మునిగి చాలా ఇబ్బంది పడ్డాం. ముంపులో ఉన్న సమయంలోనూ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇంటికే ఆహారం అందించి ఆదుకుంది. రూ. 25 వేలు ఇంత వేగంగా పడతాయని అనుకోలేదు. ద్విచక్రవాహనానికి కూడా డబ్బులు పడతాయని చెప్పారు. మా సమస్యలను దేవుడిలా పరిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. **- పార్వతమ్మ, వాంబేకాలనీ**

తోపుడు బండిపై మళ్లీ వ్యాపారం..



ఇంట్లో గృహోపకరణాలు పాడై.. ఇటు జీవనాధారమైన తోపుడు బండి పళ్లు.. కూరగాయలతో సహా కొట్టుకుపోయింది. బండి దొరికినా.. పాడైంది. వ్యాపారం చేసేందుకు పెట్టుబడి కూడా లేకుండా రోడ్డున పడ్డాం. ప్రభుత్వం సకాలంలో స్పందించి మా ఖాతాలో రూ.25 వేలు వేసింది. మళ్లీ వ్యాపారం చేసుకునేందుకు మాకు అవకాశం కలిగింది. **- శ్రీనివాసరావు, సింగ్‌నగర్**

బుకింగ్ అయిన వెంటనే ఇసుక సరఫరా



కృష్ణలంక, న్యూస్‌టుడే: బుకింగ్ చేసుకున్న వెంటనే ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని.. రవాణా చేసే వాహనదారులతో సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉచిత ఇసుక విధానం అమలుపై కలెక్టర్ జి.సృజన జేసీతో కలిసి గురువారం గనులు, భూగర్భ, రవాణా ఇసుక లారీల యజమానుల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆలస్యం లేకుండా త్వరితగతిన రవాణా జరిగేలా వాహనదారులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. రీచ్ నుంచి వినియోగదారుల ఇంటి వద్దకే ఇసుక రవాణా చేసిన వాహనాలకు జాప్యం లేకుండా సంబంధిత రుసుంను నేరుగా ఖాతాల్లో జమ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. రవాణాకు ఆసక్తి కలిగిన వాహన యజమానులు ఏపీ శాండ్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇసుక రవాణాలో ఇటీవల తీసుకున్న నిర్ణయాలు, బుకింగ్ అనంతరం ఇంకా సరఫరా చేయాల్సిన ఇసుక రవాణా, ఫెసిలిటేషన్ కేంద్రాల్లో గుర్తించిన సమస్యలు, ఐవీఆర్ఎస్ రిపోర్టు స్టేటస్, జీఎస్టీ తదితర అంశాలపై చర్చించారు. గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు వీరాస్వామి, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్న కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె.వెంకటేశ్వరరావు, పీవీ రమణారావు, శాండ్ అండ్ లారీ ఓనర్సు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంత త్వరగా ఇస్తారని ఊహించలేదు

– వేగినేటి శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు, రైతు



గతంలో ఇదే మాదిరి వరదలకు పంట నష్టపోతే ఐదారు నెలలకు అతి తక్కువగా పరిహారం దక్కేది కాదు. ఇప్పుడు నష్టం జరిగిన 25వ రోజుకే ఎకరానికి రూ. 10 వేలు పరిహారం ఇచ్చారు. ఇంత త్వరగా ఇస్తారని ఊహించలేదు.

సీఎంకు ధన్యవాదాలు...

– నల్లపనేని సుజాత, పెనుగంచిప్రోలు, మహిళా రైతు



వరదలకు ఎకరన్నర వరి పంటకు నష్టం జరిగింది. ప్రభుత్వం రూ. 15 వేలు ఖాతాలో జమ చేసింది. నష్టపోయిన పంట స్థానంలో మరో పంట సాగు చేసుకునేందుకు మాకు తోడుగా నిలిచి సత్వరం ఆదుకున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.

సకాలంలో పరిహారం.. అన్నదాతల సంతోషం



పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పంటలకు సకాలంలో నష్టపరిహారం అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి గురువారం పెనుగంచిప్రోలులో రైతులు క్షీరాభిషేకం చేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పలువురు మునేరు ఆయకట్టులోని రైతులు తమ పొలాల్లో సీఎం చంద్రబాబు చిత్రపటంపై 'థ్యాంక్యూ సీఎం సార్' అని రాశారు. నెల గడవక ముందే పంట నష్టపరిహారం అందించటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొండ, శ్రీనివాసరావు, ఆజాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు పొలాల్లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వరద బాధిత రైతులు



బారికేడ్ల వద్దకు దూసుకొచ్చిన ఇరుపక్షాలను అదుపు చేస్తున్న పోలీసులు

బందరులో గంటపాటు ఉద్రిక్తత..

పరస్పర దూషణలతో జనసేన, వైకాపా శ్రేణుల నినాదాలు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: జనసేనాని పవన్‌కల్యాణ్‌ను మాజీ మంత్రి, వైకాపా నాయకుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) విమర్శించడాన్ని ఖండిస్తూ జనసేన ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం గంట పాటు ఉద్రిక్తత, ఉద్విగ్నతలకు కారణమైంది. పవన్‌ను ఉద్దేశిస్తూ వైకాపా కార్యాలయంలో బుధవారం పేర్ని చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉదయం 12 గంటల సమయంలో జనసైనికులు, నాయకులు పేర్ని ఇంటికి చేరువగా రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. వారిని పేర్ని ఇంటి వరకూ వెళ్లనీయకుండా పోలీసులు రహదారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పేర్ని నాని బయటకు వచ్చి తమకు సమాధానం చెప్పాలంటూ జనసైనికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. పేర్ని ఇంటి వద్దకు చేరుకున్న వైకాపా కార్యకర్తలు, నాయకులతో కలిసి పేర్ని కిట్టు పోలీసులు అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా బారికేడ్ల వరకూ దూసుకొచ్చారు. ఇరుపక్షాలు నినాదాలతో ఒకరినొకరు రెచ్చగొట్టుకునే ప్రయత్నం చేశారు. ఒంటి గంట సమయంలో జనసేన నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. వెనక్కు వెళ్లకుంటే అదుపులోకి తీసుకుంటామంటూ హెచ్చరించడంతో వైకాపా శ్రేణులు వెనుదిరిగాయి.



పేర్ని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసైనికులు

5000 మందితో బందోబస్తు

దసరా ఉత్సవాలకు ఏడు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ■ నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇవి 12 వరకు కొనసాగనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో దుర్గమ్మ దర్శనార్థం వస్తుంటారు. ఈ సందర్భంగా క్యూలైన్ల నిర్వహణ, బందోబస్తు, చోరీలు జరగకుండా నగర పోలీసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా లోటుపాట్లకు తావులేకుండా కసరత్తు చేస్తున్నారు. వీఐపీల రాకతో సామాన్య భక్తులు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉత్సవాలకు దాదాపు ఐదు వేల మంది అధికారులు, సిబ్బందిని మోహరిస్తున్నారు.

రద్దీకి తగ్గట్లుగా సిబ్బంది..

అమ్మవారి దర్శనార్థం సాధారణ రోజుల్లో రోజుకు లక్ష మంది చొప్పున, మూలా నక్షత్రం రోజు 2.5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా. దసరా రోజు నిర్వహించే తెప్పోత్సవం సందర్భంగా రెండు లక్షల మంది వరకు దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో కొండపైన, దిగువన ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణకు నగర కమిషనరేట్‌లోని సిబ్బందికి తోడుగా వివిధ జిల్లాల నుంచీ పోలీసులను పిలిపిస్తున్నారు. తొమ్మిది రోజులపాటు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రోజుకు మూడు షిఫ్టుల్లో విధులు కేటాయించనున్నారు. సాధ్యమైనంత ఎక్కువ మందిని ఆలయం, దుర్గాఘాట్, చుట్టుపక్కల ప్రాంతాల్లో వినియోగించనున్నారు. భక్తుల రద్దీ తట్టుకునేలా పలు క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో తొక్కిసలాటకు తావులేకుండా ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో దాదాపు 15వేల మంది వరకు వేచి ఉండే అవకాశం ఉంది.



అణువణువునా నిఘా..

ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి దృశ్యాలను చూసేందుకు 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లో సిబ్బందికి విధులు కేటాయిస్తున్నారు. లక్షల్లో భక్తులు వస్తున్నందున నేరస్థుల కదలికలపైనా నిఘా ఉంచబోతున్నారు. చోరీలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు, సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నియమించనున్నారు. డ్రోన్లతో అవసరమైన చోట్ల చిత్రీకరిస్తారు. అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లాల దొంగలు వచ్చే వీలున్నందున, వారిని పసిగట్టి అదుపులోకి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక సమాచార కేంద్రాలు...

వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం పోలీసు సేవాదళ్ వాలంటీర్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి షిఫ్ట్‌లో ఉండే వాలంటీర్లు నడవలేని వారిని సాయం చేస్తారు. ఆలయానికి సొంత వాహనాల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం సమీపంలో పలు చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. దాదాపు ఏడు చోట్ల ద్విచక్ర వాహనాలు, కార్లు నిలిపేందుకు ఆస్కారం ఉంది. భక్తుల సౌకర్యార్థం వివిధ చోట్ల పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో రద్దీ ఎలా ఉందో ఇక్కడ తెలుసుకోవచ్చు. పరిస్థితిని బట్టి దర్శనానికి వెళ్లొచ్చు. దీంతో అనవసర రద్దీ తగ్గే వీలుందని అంచనా వేస్తున్నారు.

దుర్గ గుడి అభివృద్ధి పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చేపట్టిన అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ నియమించిన నిపుణుల బృందం గురువారం పరిశీలించింది. దుర్గ గుడి ఘాట్ రోడ్డు వద్ద రిటైనింగ్ గోడ నిర్మాణం, ఘాట్ రోడ్డులో రాక్ మిటిగేషన్ పనులు, మల్లేశ్వరాలయం మెట్ల వద్ద నిర్మించిన ఫుట్ బ్రిడ్జి, అన్నదానం, ప్రసాదాల పోటు నిర్మాణ పనులను విశ్రాంత ఇంజినీర్ కొండలరావు పర్యవేక్షణలోని బృందం పరిశీలించి పలు సూచనలు చేసింది. రాక్ మిటిగేషన్ పనులు దసరా ఏర్పాట్లకు ఆటంకం కలగకుండా చేయాలని సూచించారు. అభివృద్ధి పనులు జరిగే ప్రాంతాన్ని ఎంత వరకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని దేవస్థానం ఈవో రామారావు నిపుణుల బృందం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, వైకుంఠరావు, రమేష్ సీఈ శేఖర్, విశ్రాంత ఎస్ఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఈవో రామారావుతో మాట్లాడుతున్న నిపుణుల బృంద సభ్యులు కొండలరావు, సుబ్రహ్మణ్యం



'ఎమ్మెల్యే కొలికపూడి అక్రమాలకు అడ్డనే టార్గెట్ చేశారు'

✶ చిట్టేల సర్పంచి శ్రీనివాసరావు ఆవేదన ✶ బాధితురాలు కవితను పరామర్శించిన ఎంపీ చిన్ని, జవహర్, రఘురాం, దేవదత్

తిరువూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేస్తున్న గ్రావెల్, ఇసుక, మట్టి, బియ్యం అక్రమదందాకు పార్టీ నాయకులు, తాను ఎక్కడ అడ్డుపడతామనే భావనతో టార్గెట్ చేసి వేధిస్తున్నారని చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మేము 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాం..మూడు నెలల కిందట వచ్చి.. కనీసం తెదేపా సభ్యత్వం కూడా లేని ఎమ్మెల్యే పార్టీ సభ్యత్వం ఉన్న మమ్మల్ని సస్పెండ్ చేస్తానంటున్నారు. నేను తిరువూరులో ఎక్కడ కనిపించినా కొడతానంటూ బహిరంగంగా దుర్భాషలాడుతూ మాట్లాడడంతో ఈ అవమానాలు భరించే బదులు చావే శరణ్యమని నా భార్య నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. నా భార్య వీఆర్వోగా పనిచేస్తోంది. .మహిళా అధికారులు, ఉద్యోగుల చరవాణీల వాట్సప్‌లకు ఎమ్మెల్యే మెసేజ్‌లు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు...తిరువూరు వచ్చి ఎవరైనా విచారించుకోవచ్చు. ఇంత జరిగిన తర్వాత కూడా ఎమ్మెల్యే కుల రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో చిచ్చురేపుతున్నారు' అని ఆరోపించారు. అధిష్ఠానం స్పందించి ఎమ్మెల్యే స్థానంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మరొకరిని నియమించి న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సర్పంచి శ్రీనివాసరావు. పక్కన దేవదత్



చికిత్స పొందుతున్న కవితతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

☛ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేసిన అనుచిత వ్యాఖ్యలతో మాకు ఈ దుస్థితి నెలకొందని చిట్టేల తెదేపా సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు వాపోయారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలతో కలతచెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు కవితను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) గురువారం పరామర్శించి పార్టీపరంగా అండగా ఉంటామని వారి కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. వైద్యులను సంప్రదించగా ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుట పడుతోందని తెలిపారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించినట్లు తెలిసింది. అనంతరం తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి కేఎస్ జవహర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్, పలువురు నాయకులు ఆస్పత్రికి వెళ్లి కవితను పరామర్శించారు. నేతలను చూసి కన్నీటి పర్యంతమైన కుటుంబసభ్యులను ఓదార్చారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని, విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ధైర్యం చెప్పారు.

దుర్భాషలాడటం మంచి పద్ధతి కాదు: దేవదత్

గత వైకాపా ప్రభుత్వ అరాచకాలకు ప్రాణాలడ్డుగా పెట్టి సర్పంచిగా గెలిచిన తుమ్మలపల్లి శ్రీనివాసరావును దుర్భాషలాడడం పార్టీకి, వ్యక్తులకు మంచి పద్ధతి కాదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్ హితవు పలికారు. సర్పంచి భార్య కవితను గురువారం ఆయన పరామర్శించి మీడియాతో మాట్లాడుతూ..పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన సర్పంచి లాంటి నాయకులు, కార్యకర్తలను గౌరవిస్తేనే తెదేపా పటిష్ఠంగా ఉంటుందన్నారు. వైకాపా ప్రభుత్వంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రజలకు దగ్గరగా ఉన్న తనకు తెదేపాను అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు ఎంతగా శ్రమించారో తెలుసన్నారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం అని కార్యకర్తలకు అధిష్ఠానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అందినట్టే అంది.. చేజారింది!

ఆవేదనలో వరద బాధితులు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే

బుడమేరు వరద.. బెజవాడను గడగడలాడించింది. నగరాన్ని ముంచెత్తింది. ప్రజలకు తీవ్ర నష్టం మిగిల్చింది. కూటమి ప్రభుత్వం స్పందించి పరిహారం ఇచ్చింది. బ్యాంకు ఖాతాల్లో పడిన డబ్బులు నిమిషాల్లో మాయమయ్యాయి. మరికొందరి పేర్లు జాబితాల్లో గల్లంతయ్యాయి. ఇంతకీ ఏమైందంటే...

వివరాలు నమోదు చేసుకున్నారు... కానీ



అంబాపురం పంచాయతీ పరిధి.. అజిత్‌సింగ్‌నగర్ ఇన్నర్‌రింగ్‌రోడ్డు సమీపంలో ఆటో డ్రైవర్ **కందవల్లి సంతోష్‌కుమార్** నివసిస్తున్నారు. వరదల్లో అతని ఆటో పూర్తిగా మునిగిపోయింది. సర్వే వచ్చిన అధికారులు.. పేరు, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేసుకున్నారు. నష్టపరిహారానికి అర్హుల జాబితా ప్రకటించారు. అందులో సంతోష్‌కుమార్ పేరు లేదు. కానీ ఆయన 9 ఏళ్ల కుమారుడు రక్షిత్ పేరు ఉండడం గమనార్హం. వెబ్‌సైట్లో చూస్తే.. ఫ్యామిలీ నాట్ ఎలిజిబుల్ అంటూ అసలు పరిహారమే ఇవ్వలేదు. దీనిపై వీఆర్వోను సంప్రదిస్తే.. మాకేమీ తెలియదని, ప్రత్యేకాధికారిని అడగమని అంటున్నారు.

రుణ ఖాతాలో పడ్డాయ్..



అజిత్‌సింగ్‌నగర్, రాజీవ్‌నగర్‌కు చెందిన **చాట్ల గడ్డ చిరుబాబు** ఈవెంట్లలో పాటలు పాడుతుంటారు. 2019 సంవత్సరంలో ఇండియన్ బ్యాంకులో రూ.4 లక్షల రుణం తీసుకున్నారు. రూ.3 లక్షల వరకు చెల్లించారు. ఇంకా రూ.1.14లక్షలు చెల్లించాల్సి ఉంది. కొవిడ్ కాలంలో పనులు లేకపోవటంతో డబ్బులు కట్టలేకపోయారు. అప్పటి నుంచి అది పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల వచ్చిన వరదలో ఇంట్లోని సామగ్రి మొత్తం పాడైపోయింది. పరిహారం కింద రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం ఆయన బ్యాంకు ఖాతాలో రూ.25వేలు జమచేసింది. రాత్రి 7.57 గంటలకు ఆ రూ.25వేలు ఒక్కసారిగా విత్‌డ్రా అయ్యాయి. ఆరా తీస్తే.. రుణంలో చెల్లించాల్సిన రూ.1.14 లక్షలకు క్రెడిట్‌గా జమ చేసుకున్నట్లు తేలడంతో చిరుబాబు లబోదిబోమన్నారు. ఎన్యూమరేషన్‌కు వచ్చిన వారికి ఎస్‌బీఐ ఖాతా వివరాలు ఇచ్చినా, డబ్బులు మాత్రం వేరే బ్యాంకులో పడ్డాయంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కట్టుబట్టలతో ఉన్నామని, ఇప్పుడు అప్పులు చేస్తే తప్ప ఇంట్లో వస్తువులు సమకూర్చుకోలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంపు పరిహారం రాలేదంటూ బాధితుల ఆందోళన



చెవిటికల్లు సచివాలయంలో అధికారులతో బాధితుల వాగ్వాదం

చెవిటికల్లు (వీరులపాడు), న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలతో తమ ఇళ్లు ముంపునకు గురై తాము తీవ్రంగా నష్టపోయినా పరిహారం ఇవ్వలేదంటూ చెవిటికల్లు గ్రామస్థులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. తమకు పరిహారం ఎందుకు దక్కలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను నిలదీశారు. వారిని లోపలే ఉంచి భవనానికి తాళాలు వేశారు. విషయం తెలుసుకున్న స్థానిక తెదేపా నాయకులు, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి భవనానికి వేసిన తాళాలు తీయించారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకుంటామని సచివాలయ అధికారులు తెలపడంతోపాటు స్థానిక తెదేపా నేతల హామీ మేరకు ప్రజలు ఆందోళన విరమించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఆర్డీవోలకు స్థానచలనం

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో పని చేస్తున్న పలువురు ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం కలిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో పలువురు ఆర్డీవోలు బదిలీ అవగా ఆయా స్థానాల్లో కొత్తవారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణిని నూజివీడు ఆర్డీవోగా బదిలీ చేస్తూ ఆ స్థానంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎ.స్వాతిని నియమించారు. ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు నరసాపురానికి బదిలీ కాగా ఆయన స్థానంలో పి.సంపత్ హేలా షారోన్‌ను, విజయవాడ ఆర్‌అండ్‌ఆర్‌లో ఎస్‌డీసీగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును గుంటూరు ఆర్డీవోగా, శిక్షణ పూర్తి చేసుకున్న మాధురిని తిరువూరు ఆర్డీవోగా నియమించారు. గుడివాడ ఆర్డీవో పద్మావతిని జీఏడీ వద్ద రిపోర్ట్ చేయమని ఆదేశించడంతో పాటు గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న బాలసుబ్రహ్మణ్యంను ఆమె స్థానంలో నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.చైతన్యను విజయవాడ ఆర్డీవోగా, ఆరోగ్యశ్రీ ట్రస్టు ఎడిషనల్ సీఈవో కె.బాలకృష్ణను నందిగామ ఆర్డీవోగా, విజయవాడ అడిషనల్ కమిషనర్ ఎ.మహేష్‌ను ధర్మవరం ఆర్డీవోగా, ఎన్టీఆర్ జిల్లా కేఆర్‌సీసీ ఎస్‌డీసీగా పనిచేస్తున్న కిరణ్మయిని సూళ్లూరుపేట ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నష్ట పరిహారానికి మరో 10,500 కుటుంబాల అర్హత

కృష్ణలంక: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో ఈ నెల 22, 23న తేదీల్లో మళ్లీ క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు స్వీకరించగా 13,800 అర్జీలు వచ్చాయని.. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ జి.సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 10,500 కుటుంబాలు వారు పరిహారానికి అర్హత సాధించారని, ఈ జాబితాను ప్రభుత్వానికి పంపుతామని ఆమె పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల్లో కుటుంబాలకు జరిగిన నష్టాన్ని 1500 బృందాలతో అంచనా వేశామన్నారు. ఐఏఎస్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరిగిందన్నారు. బాధితులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. ప్రభుత్వం బుధవారం లబ్ధిదారుల ఖాతాలకు సాయాన్ని విడుదల చేసిందని, అయితే ఏ ఒక్క బాధిత కుటుంబం ఎన్యూమరేట్ కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. ప్రతి అర్జీని పీజీఆర్‌ఎస్‌లో నమోదు చేసి పరిశీలన ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆమె వివరించారు.

వంగవీటి రాధాకృష్ణకు స్వల్ప గుండెపోటు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మాజీ శాసనసభ్యుడు, వంగవీటి మోహనరంగా తనయుడు రాధాకృష్ణ స్వల్ప గుండెపోటుకు గురయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉంటున్న ఆయనకు.. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఛాతిలో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయన్ని గవర్నర్‌పేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. పలు వైద్య పరీక్షలు చేయగా.. స్వల్పంగా గుండెపోటు వచ్చినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే చికిత్స చేశారు. ప్రస్తుతం రాధాకృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు వెల్లడించారు.

'నూతన మద్యం విధానాన్ని సవరించాలి'



మాట్లాడుతున్న దుర్గాభవానీ. చిత్రంలో పద్మశ్రీ, రమాదేవి తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి అమలు చేయనున్న మద్యం నూతన విధానంలో సవరణలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ కోరారు. ఎక్కువ ఆదాయం వచ్చేలా దుకాణాలు పెంచడం, రూ.99కే మద్యం అందించడం సరికాదన్నారు. మహిళా సంఘాల ఐక్యవేదిక, భారత జాతీయ మహిళా సమాఖ్య, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం దాసరి భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా 2600 మద్యం దుకాణాలు పెంచడం, ప్రైవేటు వ్యక్తులకు లైసెన్స్‌లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి రూ.2వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. ఇది పేద ప్రజల జీవితాలను మరింత చీకటిమయం చేయడమేనని పేర్కొన్నారు. యువత బానిసవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. అనర్థాలపై ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. మద్యానికి బానిసై మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, డి ఎడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్యం అందించాలని కోరారు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. అమ్మకాలను నియంత్రించాలని, ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 వరకు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ.. మద్యం విధానంలో మార్పులు కోరుతూ అక్టోబరు 2న జిల్లా, మండల కేంద్రాల్లో మహాత్మా గాంధీ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. మహిళలు, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల నాయకులు ధారా బిందు, అరుణ్‌కుమార్, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, డి.సీతారావమ్మ, లంక నాగమణి, దుర్గాసి రమణమ్మ, చింతాడ పార్వతి, బి.శాంతి, రాహేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికే జగన్ కొత్తనాటకం'

ఈనాడు డిజిటల్, అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపిన పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికి, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే తిరుమలకు కాలినడక పేరుతో మాజీముఖ్యమంత్రి జగన్ కొత్తనాటకం మొదలుపెట్టారని తెదేపా అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. పాపం మీ హయాంలో జరిగితే...ఇప్పుడు ప్రక్షాళన అంటూ పూజలకు పిలుపునివ్వడం అర్థరహితమని జగన్‌పై గురువారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "జగన్‌రెడ్డి కుటుంబం మొత్తం క్రైస్తవ మతాన్ని ఆచరిస్తుంది. ఈ సారి జగన్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేప్పుడు ఆయన కచ్చితంగా డిక్లరేషన్ మీద సంతకం పెట్టాలి. అలా కాకుండా గుడిలోకి వెళ్లాలని ప్రయత్నిస్తే హిందువుల్ని అవమానించినట్టే" అని విజయ్‌కుమార్ మండిపడ్డారు.

'తిరుమలకు వెళ్లేముందు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే'

ఈనాడు, అమరావతి : 'వైకాపా అధినేత జగన్ క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నారు. ఈ విషయం అందరికీ తెలుసు. నచ్చిన మత విశ్వాసాన్ని అనుసరించడం అందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ...జగన్ హిందూ దేవాలయాలలోనికి ప్రవేశించాలనుకున్నప్పుడు..హిందూ విశ్వాసాల ఆచారాలు, సంప్రదాయాలు, నియమాలు, నిబంధనలను గౌరవించాల్సిందే' అని భాజపా ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన జారీచేశారు. 'హిందువులు కానివారు డిక్లరేషన్ ద్వారా మాత్రమే వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి అర్హులు. తిరుమలలో ప్రవేశించడానికి ముందుగానే తప్పనిసరిగా హిందువేతరుడిగా డిక్లరేషన్ ఇవ్వాల్సిందే. అంతేకాకుండా..తన పాలనలో రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరిగిన అఘాయిత్యాలు, తిరుమల లడ్డూ ప్రసాదంలో నాసిరకం నెయ్యి వినియోగంపై ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. దీనికి భిన్నంగా ఆయన వ్యవహరిస్తూ హిందూ మతం ఆచారాలు, సంప్రదాయాలు, ఆచారాలు, పద్ధతులను అవహేళన చేస్తూ రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు' అని లంకా దినకర్ మండిపడ్డారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

30న ఏఎన్‌యూకు వెంకయ్యనాయుడి రాక

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈనెల 30న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రానున్నారు. పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంత్యోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర ఈ సభలో పాల్గొననున్నారు. సభ నిర్వహణకు ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య గంగాధర్ 8 కమిటీలను నియమించారు. ఆహ్వానం, సేవలు, సన్మానం, రవాణా, మీడియా, అకడమిక్ తదితర కమిటీలతో ఆచార్య గంగాధర్ సమావేశమయ్యారు.

అప్పుల బాధతో కౌలురైతు బలవన్మరణం



మృతి చెందిన మేడ వెంకటరవి

నందిగామ, న్యూస్‌టుడే : అప్పుల బాధతో కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపాలిటీ శివారు హనుమంతుపాలెంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేడ వెంకటరవి(45) ఐదెకరాల పొలం కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నారు. రెండేళ్ల నుంచి పంటలు పండక, గిట్టుబాటు ధరల్లేక పెట్టుబడులకు చేసిన అప్పులు తీరలేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పైర్లు దెబ్బతినడంతో అప్పులు తీరే మార్గం కనిపించలేదు. ఐదెకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై పొలంలో పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. తెదేపా నాయకులు రాటకొండ చంద్రశేఖర్, రాటకొండ గిరి, ఘంటా రామయ్యలు సందర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

వివాహమై 40 రోజులకే కానరాని లోకాలకు..



దినేష్ (పాతచిత్రం)

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఆ యువకుడికి వివాహమై నెలా పది రోజులు అయ్యింది. అప్పుడే అతడికి నూరేళ్లు నిండాయి. మరో పది నిముషాల్లో ఇంటికి చేరుకునే లోపే మృత్యువు వెంటాడింది. అనుకోని విధంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా పుల్లంపేట గ్రామానికి చెందిన నాదెళ్ల దినేష్ (32)కి విజయవాడ, పాల ఫ్యాక్టరీ సమీపంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన జోష్నవితో గత నెల 14వ తేదీన వివాహమైంది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట గ్రామంలో ఉంటూ.. సెలూన్ నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అతడి భార్య జోష్నవి 9వ తరగతి వరకు చదివింది. పాఠశాలలో టీసీ తీసుకుందామని ఈనెల 23న భార్యభర్తలు ఇద్దరూ వైఎస్సార్ కాలనీకి వచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే ఉన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లో జోష్నవి అత్త రాఘవేణి ఉండగా ఆమె పలకరించి వస్తానని చెప్పి ద్విచక్ర వాహనంపై ఈనెల 25వ తేదీన రాత్రి దినేష్ 9.30 గంటలకు వెళ్లారు. తిరిగి కాలనీకి వస్తుండగా వైవీరావ్ రింగు సెంటర్ సమీపంలోని వెల్‌కం హోటల్ సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన మిఠాయిలు విక్రయించే తోపుడు బండిని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. దినేష్ ఇంటికి చేరుకున్నాడో లేదోనని రాత్రి 10.45 గంటలకు రాఘవేణి ఫోన్ చేసింది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి వెల్‌కం హోటల్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిందని చెప్పారు. వెంటనే ఆమె జోష్నవికి ఫోన్ చేసి విషయం చెప్పగా ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే రోడ్డు పక్కన మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. రాత్రి 11.45 గంటలకు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వివాహమై 40 రోజులకే కానరాని లోకాలకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గురువారం అతడి భార్య ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ చిన కొండలరావు తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఎమ్మెల్యే కొలికపూడిపై తెదేపా అధిష్ఠానం చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

తిరువూరు, న్యూస్‌టుడే: అక్రమాలను వెలికితీస్తూ తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే అక్కసుతో విలేకర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇంటికొచ్చి కొడతానంటూ హెచ్చరించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తెదేపా అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం భవిష్యత్తు కార్యాచరణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేపై చర్యలు కోరుతూ శనివారం మంగళగిరి తెదేపా కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటూ విలేకర్లకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే విలేకర్లకు క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విలేకరులకు క్షమాపణ చెప్పాలని వైకాపా నియోజకవర్గ కన్వీనర్ నల్లగట్ల స్వామిదాసు హితవు పలికారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పరుష పదజాలంతో దూషించడంతో సర్పంచి భార్య కవిత ఆత్మహత్యకు ప్రయత్నించిందని, ఈ ఘటనకు ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ ఎన్.సుధారాణి, నాయకులు చలమాల సత్యనారాయణ, షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట గండిని పూడ్చండి

వినగడప (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడప రాళ్ల చెరువుకు పడిన గండిని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ.కృష్ణ గురువారం పరిశీలించారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తడంతో బలహీనంగా ఉన్న చెరువు కట్టకు గండిపడి నిల్వ ఉన్న నీరు బయటకు పోయి ఆయకట్టులో సాగు చేసిన వరి పంట దెబ్బతిన్నదన్నారు. మరో వైపు రాళ్ల చెరువు అలుగు వద్ద ఆక్రమణదారులు మట్టి పోయడంతో గండిపడేందుకు కారణమైందన్నారు. సత్వరమే గండి పూడ్చించాలని కోరారు. ఎం.వెంకటరెడ్డి, జి.వీరభద్రం, బి.వీరబాబు, సత్యంబాబు, కుటుంబరావు పాల్గొన్నారు.



వినగడప రాళ్ల చెరువు కట్టకు పడిన గండిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

29, 30న నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

తిరువూరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త ఎం.రమేశ్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు.

భూసార పరీక్ష కార్డుల పంపిణీ

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: మూలపాడు రైతుభరోసా కేంద్రంలో గురువారం నిర్వహించిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. వ్యవసాయాధికారిణి శైలజ, ఎంపీఈఓ రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే బురద.. ఎండొస్తే దుమ్ము

విస్తరణకు నోచుకోని రహదారిపై ప్రయాణికుల పాట్లు

జి.కొండూరు, న్యూస్‌టుడే

మండలంలోని కందులపాడు గంగినేని ఎర్రపాలెం (కేజీవై) ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. జి.కొండూరు నుంచి గంగినేని వరకు దాదాపు 15 కిలోమీటర్ల మేర గుంతలు ఏర్పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రమైన జి.కొండూరు చేరాలంటే దుగ్గిరాలపాడు, గంగినేని, తెల్లదేవరపాడు, సున్నంపాడు, మునగపాడు, గడ్డమణుగు తదితర గ్రామాలకు ఈ మార్గమే కీలకం. ఈ క్రమంలో అప్పటి జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు 2019 ఫిబ్రవరిలో న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.94 కోట్లతో శంకుస్థాపన చేశారు. అదే సమయంలో సాధారణ ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారి రహదారి నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.



మునగపాడు కేజీవై రహదారిలో రాత్రి సమయంలో వాహనదారుల అవస్థలు



సున్నంపాడులో భారీ వాహనం వెనుక దుమ్ము ఇలా

బిల్లులు చెల్లిస్తే సిద్ధమే

ఎండొస్తే దుమ్ము..వానొస్తే బురద ఇలా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు మునగపాడు బైపాస్‌లో మోటరు గడ్డ సమీపంలో పులివాగుపై నిర్మించిన వంతెన ఒక ఖానా ఇటీవల వరద ఉద్ధృతికి ధ్వంసమైంది. త్వరితగతిన వంతెన మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలని.. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆగిపోయిన కేజీవై రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ సహాయక ఇంజినీర్ హుస్సేనిను న్యూస్‌టుడే వివరణ కోరగా బిల్లులు చెల్లిస్తే గుత్తేదారు రహదారి విస్తరణ పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ప్రత్యక్ష నరకంలా మారి

పలుమార్లు ఈనాడులో కథనాలు ప్రచురించడంతో అప్పటి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ 2022 ఆగస్టులో మరోసారి రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో గుత్తేదారు రహదారి పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామంటూ.. ద్విచక్రవాహన రోడ్డులో తారు తొలగించి వెట్‌మిక్స్ పరిచారు. కొన్ని చోట్ల కల్వర్టులు నిర్మించారు. దాదాపు రూ.9 కోట్ల విలువైన పనులు చేపట్టినా అప్పటి ప్రభుత్వం బిల్లు చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలకు అటూ ప్రయాణించాలంటేనే ప్రత్యక్ష నరకం కనపడుతోంది. వాన కురిసిన సమయంలో వెట్‌మిక్స్ కొట్టుకుపోయి గుంతల్లో నీరు నిలిచిపోతున్నాయి.



పుర కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికుల నిరసన

తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. వేతన బకాయిలు చెల్లించాలంటూ పురపాలిక కార్యాలయం వద్ద కార్మికులు గురువారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించనందున కార్మికులు పస్తులు ఉంటున్నారని.. అప్పులు పుట్టక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.అప్పారావు, జి.సురేష్, నవీన్, రమణ, దేవుళ్లు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకాలు.. గ్రామోత్సవాలు

నష్ట పరిహారం పంపిణీపై హర్షం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా నది వరదల కారణంగా ముంపునకు గురైన ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం పరిధిలోని వరద బాధితుల ప్రతి కుటుంబానికి వారి వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం గురువారం రూ.25 వేల చొప్పున జమ చేసింది. దీంతో దాములూరు, కొటికలపూడి, చిలుకూరు, జూపూడి గ్రామాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వసంత చిత్రపటాలతో గ్రామోత్సవాలు నిర్వహించి కూడళ్ల వద్ద పాలాభిషేకాలు చేశారు. తెదేపా మండలాధ్యక్షుడు రాజశేఖర్, ఆయా గ్రామాల నాయకులు శ్రీనివాసరావు, చిట్టిబాబు, సుబ్బారావు, నాగేశ్వరరావు, పాగి శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, అప్పారావు, షేక్ గాలి సాహెబ్, దాములూరు సర్పంచి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



కొటికలపూడి : ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలతో తెదేపా శ్రేణుల గ్రామోత్సవం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల బారిన పడితే జీవితం దుర్భరంగా మారుతుందని, దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు సూచించారు. నవజీవన్‌బాలభవన్ ఆధ్వర్యంలో గొల్లపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు విద్యార్థులందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సంస్థ జోనల్ కోఆర్డినేటర్‌లు కె.ప్రియాంక, జాకబ్ రాజు, ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న జి.శేఖర్‌బాబు

అనుమతులు లేకపోతే చర్యలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: సినిమా ప్రదర్శనలకు అనుమతులు లేకపోతే చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం తహసీల్దారు వెంకటేశ్వర్లు అన్నారు. అధిక ధరలకు సినిమా టికెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆయన స్థానిక సినిమా దియోటర్లను గురువారం తనిఖీలు చేసి మీడియాతో మాట్లాడారు. దేవర సినిమా విడుదల సందర్భంగా కొన్ని దియోటర్లకు ప్రత్యేక అనుమతులు వచ్చాయన్నారు. అయితే టికెట్ ధర పెంపు, ప్రదర్శనల వేళల అనుమతుల విషయంపై తనిఖీ చేస్తున్నామన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.



మైలవరంలో వాలీబాల్ క్రీడలో జంప్ సర్వీస్ కొడుతున్న క్రీడాకారుడు

ఉత్సాహంగా ఆటల పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ఎస్‌కే ఆంగ్ల మాధ్యమ పాఠశాల మైదానాల్లో గురువారం 68 ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం మండలాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-17 కబడ్డీ జి.కొండూరు, ఖోఖో మైలవరం, వాలీబాల్ రెడ్డిగూడెం, షటిల్‌బాడ్మింటన్ మైలవరం, చెస్ విజయవాడ రూరల్, యోగా పోటీల్లో మైలవరానికి చెందిన విద్యార్థులు విజేతలయ్యారు. అండర్-14 కబడ్డీ జి.కొండూరు, ఖోఖో మైలవరం, వాలీబాల్ రెడ్డిగూడెం, షటిల్ బాడ్మింటన్ మైలవరం, చెస్, యోగా పోటీల్లో ఇబ్రహీంపట్నానికి చెందిన విద్యార్థులు గెలిచినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీడీ ఎం.రవికుమార్ తెలిపారు. పరీక్షల కారణంగా బాలికల పోటీలను వాయిదా వేసినట్లు తెలియజేశారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక

జి.కొండూరు: మైలవరంలో నియోజకవర్గం స్థాయిలో గురువారం నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో కవులూరు భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. అండర్-14 విభాగం కబడ్డీలో ఎన్ కోమల్‌దీప్, షటిల్‌బాడ్మింటన్‌లో బి.కుమార్, అండర్-17 విభాగం కబడ్డీలో కె.రామసోమేశ్వరరావు, వాలీబాల్‌లో జి.మహేంద్ర జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఒ.నాగేంద్రరావు తెలిపారు. క్రీడాకారులు, పీడీకి శ్రీలతకు అభినందనలు తెలిపారు.

రెడ్డిగూడెం: మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ హైస్కూల్లో నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో రెడ్డిగూడెం నారాయణ హైస్కూల్ విద్యార్థులు ఎం.రంజిత్ నాయక్, వి.వరుణ్, సిహెచ్.ధీక్షిత్, సిహెచ్.రంజిత్, కట్టా హేమ ఉపేంద్రలు ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వి.రాధా కృష్ణా రెడ్డి తెలిపారు.

తిరువూరు, న్యూస్‌టుడే: మండలస్థాయిలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల్లో మండలంలోని మల్లేల నన్నక నరేంద్ర, ధనలక్ష్మి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. ఖోఖో, కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు నియోజకవర్గస్థాయి ఆటల పోటీలకు అర్హత సాధించారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీధర్, వ్యాయామోపాధ్యాయుడు ఎస్.కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కులవృత్తి ఉపాధిని దెబ్బతీయొద్దు

కొండపల్లి, న్యూస్‌టుడే: అనాదిగా క్షవర వృత్తిపై ఆధారపడిన తమ వృత్తిని దెబ్బతీయవద్దని నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కొండపల్లి నాయీబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాలకు చెందిన సెలూన్ దుకాణాల వద్ద గురువారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యాపార పెట్టుబడులు పెట్టి తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. వారి వల్ల తాము రోడ్డున పడే పరిస్థితులు తలెత్తుతున్నాయని వాపోయారు. ఇలా సెలూన్ వ్యాపారాలను పెట్టుకొనే వారికి అనుమతులు మంజూరు చేసి కుల వృత్తిదారులకే అవకాశం కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ దుర్మరణం

పెళ్లకూరు, న్యూస్‌టుడే: ఆగిన ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ కార్తీక్(16) మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన క్లీనర్ కార్తీక్ లారీలో తిరుపతి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్నాడు. చిల్లకూరు వద్ద ఆగిన ఉన్న లారీని వీరి లారీ ఢీకొట్టింది. కార్తీక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ వినోద్‌కు తీవ్రగాయాలు కాగా తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: బాలికలను వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తిరువూరు జేఎఫ్‌సీఎం కోర్టు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.సింధూర తెలిపారు. మండలంలోని నరసాపురం సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా లైంగికంగా వేధించినా, వెంటపడినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. బాలికల రక్షణకు పటిష్ఠమైన చట్టాలు అమలులో ఉన్నాయని తెలిపారు. పోక్సో కేసులు విచారించడానికి ప్రత్యేక కోర్టులు ఉన్నాయని, పరిహారం కూడా పొందడానికి వీలుందన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు సంకురాత్రి జనార్దనరావు, రాజవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.సింధూర



తిరువూరు: కరపత్రాలు పంపిణీలో ఎమ్మెల్యే కొలికపూడి



రెడ్డిగూడెం: గోడపత్రికల ఆవిష్కరణ..



గంపలగూడెం : గోసవీడులో ..

ప్రభుత్వ పథకాలు సద్వినియోగించుకోండి

తిరువూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయా పార్టీల నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఆయన కరపత్రాలు పంపిణీ చేశారు.

విద్యుత్తు మీటర్ రీడర్లకు సాయం

గొల్లపూడి, న్యూస్‌టుడే: వరదల కారణంగా నష్టపోయిన విద్యుత్తు శాఖ మీటర్ రీడర్లకు ఏఐటీయూసీ నాయకులు సాయం అందించారు. రీడర్లకు దుప్పట్లు, లుంగీలు, టవల్స్‌తో పాటు నగదును అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు ఓబులేసు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



రీడర్లకు దుస్తులు పంపిణీ చేసిన ఏఐటీయూసీ నాయకులు

కూలి రేట్లు పెంచాలని నిరసన

గొల్లపూడి, న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్‌లో పని చేసే ముఠాకార్మికులకు కూలి రేట్లు పెంచాలంటూ గొల్లపూడిలోని స్టాక్‌పాయింట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ హమాలీ సంఘం నాయకుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులకు క్వింటాకు రూ.30లు, బోనస్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. కూలి రేట్లు పెంచకపోతే సమ్మె చేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి హమాలీల సమస్యను పరిష్కరించాలని కోరారు. మేస్త్రీలు తాతయ్య, రాఘవరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

పశు చికిత్స కేంద్రం పరిశీలన

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వరద ముంపునకు గురైన మూలపాడు పశుచికిత్స కేంద్రాన్ని గురువారం జిల్లా సంయుక్త సంచాలకులు హనుమంతరావు పరిశీలించి వరద నీటిలో మునిగి పాడైపోయిన వస్తువులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మోసెస్ వెస్లీ, కృష్ణమూర్తి, మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై అవగాహన

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో గురువారం అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై గ్రామసభలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర గోడపత్రికలను ఆవిష్కరించారు.

వృద్ధులకు అన్నదానం

రెడ్డిగూడెం: స్థానిక ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీరాంపురం గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు వెల్ది రాంబాబు మనవడు మోరంపూడి జగదానంద్ కుశాల్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం వృద్ధులకు అన్నదానం చేసినట్లు సంస్థ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆంధ్రా ఆసుపత్రి సౌజన్యంతో అమరావతి సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు ప్రారంభించారు. ఆంధ్రా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్.ఎ.అచ్యుతబాబు, వైద్య బృందం పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో గురువారం ప్రథమ సంవత్సరం చదువుతున్న 148 మందికి విద్యార్థులకు ప్రైమరీ హెల్త్‌సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ పి.రంగారావు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం ఇవ్వడం లేదని ఫిర్యాదు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : తన భార్య మరణించిన సమయంలో జరిగిన ఒప్పందం మేరకు ఇవ్వాల్సిన బంగారం అప్పగించడం లేదంటూ ఓ వ్యక్తి హనుమాన్ జంక్షన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై జనార్దన్ వివరాల ప్రకారం.. జి.కొండూరు మండలం చిన నందిగామకు చెందిన కొన్నగంటి గోపి చౌదరి, భార్య రూప కేడీసీసీ బ్యాంకులో పని చేస్తూంటారు. ఈ క్రమంలో 2021లో కుమారుడ్ని ప్రసవించిన కొన్ని రోజులకే ఆమె అనారోగ్యంతో మృతి చెందారు. ఆ సమయంలో ఉద్యోగ ప్రయోజనాల రీత్యా రూ.27 లక్షలు నగదు వచ్చింది. ఈ మొత్తాన్ని కుమారుడు మేజర్ అయిన తర్వాత అతడి పేరిట బ్యాంకులో వేయాలని, అప్పటి వరకు బంగారం తమ వద్దే ఉంటుందంటూ బంధువులు అప్పట్లో రూ.లక్షలు విలువ చేసే బంగారం తీసుకెళ్లారని, అనుకున్న విధంగానే రూ.27 లక్షలు, వడ్డీతో కలిపి రూ.35 లక్షలు గోపి చౌదరి కుమారుడు పేరిట ఎఫ్‌డీ వేశానని, ఈ నేపథ్యంలో బంగారం ఇమ్మని బంధువుల్ని అడగ్గా, వారు ఆ విషయం తమకు తెలియదని, ఎలాంటి బంగారం తమ వద్ద లేదంటూ చెప్పారంటూ గోపి చౌదరి నూజివీడు కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

తండ్రీకొడుకుల మృతదేహాలకు పోస్టుమార్టం

ఎ.కొండూరు: ఎ.కొండూరు అడ్డరోడ్డు సమీప మ్యాంగో యార్డు వద్ద జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందిన తండ్రీకొడుకులు మామిళ్ల శ్రీనివాసరావు(42), ప్రసంగి(19) మృతదేహాలకు గురువారం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేయించినట్లు ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపారు. బుధవారం రాత్రి గ్యాస్ సిలెండర్ల రవాణా చేస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుడి సోదరుడు కుటుంబరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, తెదేపా నాయకులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జ్వరంతో మహిళ మృతి

చింతలనర్వ(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని చింతనలర్వకు చెందిన పొదుపు సంఘాలకు చెందిన బుక్ కీపర్ గద్దల సుజాత(38) జ్వరంతో బాధపడుతూ రాత్రి మృతి చెందింది. మూడు రోజులపాటు జ్వరంతో ఉన్న ఆమెకు ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం మధిరలో ఓ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అక్కడ బుధవారం రాత్రి మరణించింది. గురువారం ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, తెదేపా నాయకులు నివాళులర్పించారు.



గద్దల సుజాత (పాత చిత్రం)

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్


ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న సీఐ నాయుడు, పక్కన బాధితురాలు

నందిగామ, న్యూస్‌టుడే: ఆటోలో ఓ వృద్ధురాలు మర్చిపోయిన బంగారు గొలుసును ఆటో డ్రైవర్ తిరిగి అప్పగించి తన నిజాయతీని చాటుకున్నారు. నందిగామకు చెందిన సురేష్‌కుమార్ ఆటోలో లక్ష్మీతులిశమ్మ ఎక్కారు. ఆమె దిగి వెళ్తూ ఆటోలో బంగారు గొలుసు మర్చిపోయారు. దానిని సురేష్ చూసి వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లి సీఐ వైవీవీఎల్ నాయుడుకు అప్పగించారు. అనంతరం బాధితురాలిని పిలిపించి గొలుసు ఇచ్చారు. ఆటో డ్రైవర్‌కు సీఐ పూలమాల వేసి శాలువా కప్పి అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

◆ కంచికచర్ల ప్రణీత కాలనీలో తాగు నీటి పైపు లైను పగిలి తాగు నీరు వృథాగా పోతోందని ఏసుపోగు బాబు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి శ్రీలక్ష్మికి సమాచారం అందించారు. స్పందించిన ఏఈ పైపులైను పగిలిన చోట మరమ్మతులు చేయించారు.

◆ కంచికచర్ల బుడ్డి వారి వీధిలో కాలువలో చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని స్థానికుడు సూర్య ప్రకాష్ 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి బ్రహ్మంకు సమాచారం ఇచ్చారు. ఆయన స్పందించి సిబ్బందితో చెత్త తొలగించి మురుగు నీరు పారేలా చర్యలు తీసుకున్నారు.

◆ వేములపల్లి బీసీ కాలనీ ప్రధాన రహదారికి రెండు వైపులా చెత్త నిల్వ ఉంటుండడంతో దుర్వాసన వస్తోందని గ్రామానికి చెందిన కోటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి వనితకు ఫిర్యాదు చేశారు. ఆమె స్పందించి సిబ్బందితో చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించారు.

◆ బత్తినపాడు ఎస్సీ కాలనీలో వీధి దీపం వెలగక రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని గ్రామానికి చెందిన హనుమంతరావు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వీధి దీపం మార్పించారు.

- న్యూస్‌టుడే, వీరులపాడు

కార్మికుడి కుటుంబానికి పరామర్శ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని షేర్‌మహమ్మద్ పేటలో ఇటీవల మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు కురుమర్తి దేవయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.సోమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఆయన ప్రజా సంఘాల నాయకులతో కలసి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, జె. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం గ్రామ కార్యదర్శిగా వెంకటరావు

జగ్గయ్యపేట గ్రామీణం: మండలంలోని షేర్‌మహమ్మద్ పేట గ్రామంలో సీపీఎం 3వ గ్రామ శాఖ కార్యదర్శిగా జె.వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, దంతాల రాజేశ్వరి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.24.64 లక్షలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ. 24,64,906 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంకేటీఎన్ వరప్రసాద్ తెలిపారు. హుండీ ఆదాయం రూ. 23,98,978.. మల్లేశ్వరస్వామికి రూ. 31,973 .. అన్నదానానికి రూ. 33,955 కానుకలు భక్తులు సమర్పించారని పేర్కొన్నారు. దేవాలయ నాలుగు నెలల తర్వాత హుండీ లెక్కించినట్లు ఆయన తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో జగ్గయ్యపేట గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి సి.హెచ్ జయప్రకాష్ బాబు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్, భక్తుల సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో పరిటాల సేవా సమితి, గ్రామీణ బ్యాంక్ కన్నెవీడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం.. అన్నదాతకు ఉపశమనం

సత్వరం అందించడంపై అన్నదాతల్లో హర్షాతిరేకాలు


కంచికచర్ల మండలం మున్నలూరు వద్ద నీట మునిగిన పత్తి పొలం


వేమవరం వద్ద వరి పొలాల్లో ఇసుక మేటలు

పెనుగంచిప్రోలు, వత్సవాయి, కంచికచర్ల, న్యూస్‌టుడే

భారీ వర్షాలు, కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన వరదలతో పంటలు పూర్తిగా కోల్పోయిన రైతన్నలకు ఎన్డీయే ప్రభుత్వం అతి తక్కువ వ్యవధిలోనే పరిహారం అందించి అండగా ఉంటామంటూ భరోసా కల్పించింది. ఈ నెల మొదటి వారంలో వర్షాలు, వరదలతో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, పెసర, కంద, వరి తదితర పంటలు నీట మునిగి రైతులు పెట్టిన పెట్టుబడి మొత్తం బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం అంచనాలు తయారు చేసేలా అధికారులను ఆదేశించింది. నష్ట పోయిన రైతుల వివరాలు ఆయా గ్రామాల సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల వద్ద ఉంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ నెల 25న బాధిత కర్షకుల వ్యక్తిగత ఖాతాలకు నష్ట పరిహారం నిధులు జమ చేసింది.

జగ్గయ్యపేట, నందిగామ మండలాల్లో పంట నష్టం.. పరిహారం వివరాలు ఇలా ఉన్నాయి

మండలం పేరు	రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	పరిహారం (రూపాయల్లో)
చందర్లపాడు	6482	3590.06	8,93,10,539.00
కంచికచర్ల	5214	3245.30	6,94,00768.50
నందిగామ	4312	2522.07	6,06,74,225.50
వీరులపాడు	2079	1378.60	2,89,51,807.00
పెనుగంచిప్రోలు	2107	1230	3,07,43,000
వత్సవాయి	1002	556	1,35,29000
జగ్గయ్యపేట	880	551	1,32,22,000

త్వరగా పరిహారం వస్తుందని ఊహించలేదు



పెనుగంచిప్రోలు మునేరు కాలువ పరిధిలో మూడెకరాల్లో వరి సాగు చేశాను. వరదకు సుమారు ఎకరం 70 సెంట్ల మేర పంట నష్టం జరిగింది. బుధవారం రాత్రి నా ఖాతాకు రూ. 7,300 నగదు జమ అయినట్లు సమాచారం వచ్చింది. ప్రభుత్వం నష్టం పరిహారం ఇస్తారు అంటే ఏ ఆరు నెలలకో వస్తుందనుకున్నా.. కానీ 25 రోజుల్లో నగదు ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
- ఏలూరి లక్ష్మీనరసమ్మ, పెనుగంచిప్రోలు

సాగుకు చేయూత అందించడం సంతోషం



గుమ్మడిదుర్రులో సొంత పొలంతో కలిపి 15 ఎకరాలు వరి సాగు చేశాను. వరదకు కొంత వరి పొలం దెబ్బతిన్నది. అందుకు ప్రభుత్వం పరిహారంగా మా ఇంట్లో వారి వివిధ బ్యాంక్ ఖాతాల్లో మొత్తంగా రూ. 25 వేలు బుధవారం రాత్రి జమ చేసింది. నష్టం జరిగిన తర్వాత తక్కువ కాలంగా పరిహారం అందించటం వల్ల మా లాంటి రైతులకు ఎంతో మేలు జరుగుతోంది.
- సూదగాని యాదగిరి, గుమ్మడిదుర్రు

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గురువారం నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డీవైఈవో ఎం.వెంకటప్పయ్య, ఎంఈవో-2 ఎం.పద్మ, ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మి పలు క్రీడా కోర్టులను ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ శాఖమూరి స్వర్ణలత, తెదేపా నాయకులు ఏచూరి రాము, వడ్డెల్లి సాంబశివరావు, కాసర్ల లక్ష్మీనారాయణ, కొండూరు వెంకట్రావు, ఎస్ఎంసీ ఛైర్మన్ మల్లెపాక శ్రీనివాసరావు, నాయకులు కత్రోజు శ్రీనివాసాచారి, మనబోతుల శ్రీరామ, ఏపూరి నాగేశ్వరరావు, అమరయ్య, రమేష్, రబ్బాని, ఎస్‌జీఎఫ్ పోటీల నియోజకవర్గ కోఆర్డినేటర్ పల్లపు శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ కల్యాణరాజు, పీడీలు డి.లక్ష్మి, భూషణం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీలో నిత్యావసరాల అందజేత

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఇటీవల వరద ముంపునకు గురైన ప్రాంతవాసులకు దాతల సహకారంతో బియ్యం, నూనె, దుప్పట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చొరవ చూపి దాతల ద్వారా ఈ ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన పంపిణీలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తెదేపా నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు చినబాబు, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, నాయకులు మైనేనిరాధ, గడ్డం రాంబాబు, యామర్తిబోసు, ఇంటూరిసాయి, వార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా నాయకులకు మరణం ఉండదు


నర్సయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం

గనిఆత్కూరు(కంచికచర్ల), న్యూస్‌టుడే : ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ప్రజా నాయకులకు మరణం ఉండదని, ప్రజల మనస్సుల్లో వారు చిరంజీవుల్లా ఉండిపోతారని తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. గని ఆత్కూరు తెదేపా నాయకుడు కొమ్మినేని నర్సయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం నెట్టెం మాట్లాడుతూ తెదేపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ పటిష్టతకు ఆయన ఎనలేని కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. నర్సయ్య విగ్రహావిష్కరణకు గతంలో వైకాపా వారు అనేక ఆటంకాలు సృష్టించారని, ఇప్పుడు వారి చిరునామా గల్లంతయ్యిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

◆ నిత్యం ప్రజలలో ఉంటూ, గ్రామ సమస్యలను తన సమస్యగా భావించి నిబద్ధతతో వాటి పరిష్కారానికి కృషి చేసిన కొమ్మినేని నర్సయ్య కన్నా ఆత్కూరు నర్సయ్యగా చిరపరిచితులని అన్నారు. విగ్రహావిష్కరణకు హాజరైన ఆయన నర్సయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

చట్టాలపై అవగాహన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే యువత చట్టాలపై అవగాహనను పెంచుకోవాలని న్యాయమూర్తి ఎం.శోభారాణి సూచించారు. స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె వారికి ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ బుస్సా సురేష్, బార్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, ప్రతినిధులు ఆంజనేయులు, టీఎల్.నరసింహారావు, దాసరి నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, వి.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిక

పెనుగంచిప్రోలు: మండలంలోని వెంగనాయకునిపాలెంలోని వైకాపాకు చెందిన 20 మంది నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సమక్షంలో తెదేపాలో చేరారు. తెదేపా మండల అధ్యక్షుడు చింతల సీతారామయ్య, భూమన నరసింహారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా మొక్కల పంపిణీ

నందిగామ: నందిగామలో కుంచం విజయ లక్ష్మీనరసమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, యూటీఎఫ్, సీఐటీయూల ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కుంచం లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి బి.రమణయ్య, నాయకులు మహేశ్వర వెంకటేశ్వరరావు, బెనర్జీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.గోపాల్, రామాలయం మాజీ ఛైర్మన్ కుంచం విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసు సిబ్బంది

కంచికచర్ల, న్యూస్‌టుడే : దారి తెలియక తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లితండ్రులకు అప్పగించిన ఘటన కంచికచర్లలో గురువారం జరిగింది. ఎస్సై బోన గిరి రాజు వివరాల ప్రకారం.. కంచికచర్ల ఇందిరా కాలనీకి చెందిన కామేశ్వరి, ఆమె భర్త కూలి పనులకు వెళ్లారు. తమ ఆరేళ్ల కుమారుడు నరేష్‌ను వేరే బాలుడితోపాటు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించారు. నరేష్ దారి తప్పి ప్రధాన రహదారిలో పరిటాల వైపు వెళ్తున్నాడు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని టైర్ల పంక్చరు దుకాణం యజమాని గోపి గమనించి బాలుడిని వివరాలు అడిగారు. అతనేమి చెప్పలేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాలుడి చిత్రాన్ని పోలీసులు స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. బాలుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు. ఇది తెలిసిన ఓ వ్యక్తి బాలుడి తల్లికి సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. పోలీసులు వివరాలు అడిగి బాలుడిని తల్లికి అప్పగించారు. తప్పిపోయిన నాలుగు గంటల్లోనే తమ కుమారుడు దొరకడంతో తల్లి ఆనందం వ్యక్తం చేసింది.

ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా వంద రోజుల పాలన


కరపత్రిక ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, అధికారులు


నందిగామ గ్రామీణం: సోమవరంలో..


నందిగామలో తెదేపా నాయకులు

వత్సవాయి, జగ్గయ్యపేట గ్రామీణం, నందిగామ గ్రామీణం, నందలూరు(వీరులపాడు), నందిగామ, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా సాగుతోందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. గురువారం కంభంపాడులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో అదుపు తప్పిన వ్యవస్థలను గాడిలో పెట్టామని తెలిపారు. భారీ వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన రైతులకు రోజుల వ్యవధిలో నష్టపరిహారం అందించి అన్నదాతలను ఆదుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. అనంతరం అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కరపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు నరసింహారావు, ఎంపీడీవో రాజు, సర్పంచి బి. పున్నమ్మ, తెదేపా మండల అధ్యక్షుడు వడ్లముడి రాంబాబు, చెకూరి రమేష్, శాంతిబాబు, బాడిశ మురళీకృష్ణ, నరాల వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఆర్‌వో నాగరాజు, ఎంపీడీఓ రమేష్ బాబు, పార్టీ మండలాధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, మాజీ సర్పంచి యానాల గోపిచంద్, నాయకులు బలుగర్ల కోటేశ్వరరావు, ఇంటూరి రఘు, గద్దె రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నందిగామ మండలంలోని సోమవరంలో గురువారం తెదేపా నాయకులు ఇది మంచిప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక తెదేపా నాయకులు ఉప్పుకొండూరు గురుప్రసాద్, మల్నీడి శ్యాంప్రసాద్, బెల్లం కోటేశ్వరరావు, జంగాల శ్రీనివాసరావు, పల్లెపోగు నాగేశ్వరరావు, గోకర్ల యోగానంద్ తదితరులు పాల్గొన్నారు. వీరులపాడు మండలం నందలూరులో నాయకులు గురువారం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. తెదేపా మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస కుమార్, ఎంపీడీవో అరుంధతీ దేవి, సచివాలయ ఉద్యోగులు, తెదేపా నాయకులు కాపా రాంబాబు, కోడెల కుటుంబరావు, యర్రగుంట కృష్ణారావు, గుత్తా నరసింహారావు, పల్లెకంటి రోశయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా ఆధ్వర్యంలో నాయకులు పేర్కొన్నారు. 13వ వార్డులోని కాకానినగర్‌లో తెదేపా నాయకుడు వేపూరి నాగేశ్వరరావు, కార్యకర్తలు కలిసి స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాసానికి వెళ్లి కరపత్రం అందజేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు గురించి వివరించారు. పెనుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదుర్రులో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక తెదేపా నాయకులు, రైతులు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పొందూరి పద్మావతి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతులు ఇది మంచి ప్రభుత్వం కరపత్రికను ఆవిష్కరించారు.

వరద నష్టం రూ.13 కోట్లు

ప్రభుత్వం ఆదుకుంటేనే సాధారణ జనజీవనం


భారీగా కోతకు గురైన జగ్గయ్యపేట పట్టణ రహదారి


పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పైపులైన్ల పునరుద్ధరణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

ప్రభుత్వానికి పంపిన అంచనాలు

అంశం	పరిమాణం	అంచనా (రూ.లక్షల్లో)
రోడ్లు	15 కి.మీ.లు	900
పైపులైన్లు	6 కి.మీ.లు	100
డ్రైన్లు	10 కి.మీ.లు	220
వీధిదీపాలు	1000	30

ఈ నెల ఆరంభంలో ముంచెత్తిన వరదల బీభత్సంలో జగ్గయ్యపేట పట్టణం తీవ్రంగా నష్టపోయింది. పట్టణం మొత్తాన్ని వరద నీరు చుట్టుముట్టడమే కాకుండా పాలేరు, ముల్లేరు, ఎర్రకాల్వ, వేపల వాగులు పొంగి పట్టణ శివార్లను ముంచెత్తడంతో ఈసారి నష్టం తీవ్రత చాలా అధికంగా ఉంది. ఇప్పటికీ ఇంకా కొన్ని శివారు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ఉండగా, ఇతర ప్రాంతాల్లో సాధారణ జనజీవనం ఇంకా తేరుకోలేదు. పట్టణంలో మౌలిక సదుపాయాలను సైతం దెబ్బతీసిన వరద నష్టం సుమారు రూ. 13 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. పట్టణంలోని 60 వేల మంది ప్రజలకు తాగునీటిని అందించే హెడ్ వాటర్ వర్క్స్ పూర్తిగా నీటిలో మునిగి పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. పట్టణంలోని అనేక రోడ్లు, డ్రైన్లు ఆనవాళ్లు లేకుండా కోతకు గురయ్యాయి. పైపులైన్ల వ్యవస్థ, విద్యుత్తు దీపాల వ్యవస్థ కూడా తీవ్రంగా ప్రభావితం అయింది. తాజాగా బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ ఛైర్మన్ రాఘవేంద్ర జరిగిన నష్టంపై ప్రభుత్వానికి పంపుతున్న అంచనాలను వివరించారు.

మధ్యాహ్న భోజనం పథకం ఏజెన్సీల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

నందిగామ, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనం పథకం ఏజెన్సీలు, హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులు, కాపలాదారులను అక్రమంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బాధితులు ధర్నా చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించి ఆర్డీవో రవీంద్రరరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా సీఐటీయూ కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ.. ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి నోటీసులు ఇవ్వకుండా కార్మికులను తొలగించవద్దని కోరారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపీనాయక్, ప్రతినిధులు హుస్సేన్, దామోదర్, మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘ నాయకులు వేల్పుల ఏసోబు, కళావతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

40శాతం ఐఆర్ అమలు చేయాలి


సభ్యత్వాల నమోదులో ఏపీటీఎఫ్ నాయకులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు దసరా కానుకగా 12వ పీఆర్సీ అమలయ్యే వరకు 40శాతం ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ కోరారు. గురువారం మండలంలోని అడవిరావులపాడు, లింగాలపాడు, పెద్దవరం, చందాపురం, కేతవీరునిపాడు, పాతకంచల జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో 2024-25 సంవత్సర ఏపీటీఎఫ్ సభ్యత్వాలు నమోదు చేయించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మద్దినేని నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి దాసరి రాజ్‌కుమార్, నాయకులు ఎస్కే మౌలాలి, జి.రవి, నజీర్ బాషా, కొండానాయక్, టి.వేణు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం, యోగాతో ఆరోగ్యం

నందిగామ: నిత్యం వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. గురువారం స్థానిక స్వర కేఎంఆర్ యూనివర్సల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సౌమ్య ప్రారంభించారు. మోకాళ్ల మార్పిడి, గుండె వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

నందిగామ: ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులందర్నీ ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు కోరారు. నందిగామలో గురువారం ఆర్డీవో రవీంద్రరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పలు గ్రామాలు, పట్టణంలో ఇళ్లల్లోకి వరద నీరు రావటం వల్ల తీవ్రంగా నష్టపోయ్యారని చెప్పారు. దీనిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

త్వరలో బాలాలయం నిర్మాణం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఇటీవల పాలేటి వరదలకు కూలిపోయిన మఠం శివాయలయం బాలాలయాన్ని తిరిగి పునర్నిర్మించేందుకు కంచి కామకోటి పీఠాధిపతులు అనుమతినిచ్చారని స్థపతి లక్కావజ్జుల సుబ్రమణ్యశాస్త్రి తెలిపారు. మఠం శివాలయం పునర్నిర్మాణ కమిటీ గురువారం సాయంత్రం ఆలయం స్థలం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పూర్తి సాంకేతికతతో ఆలయ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ప్రతినిధులు పిన్నం వెంగళరావు, నీలిశెట్టి వాసు, కొంకిమళ్ల మల్లు, సంకా భాస్కర్, శ్రీకాంత్, డోకుపర్తి రాము, గట్టిడి సాయి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులు కొనుగోలు చేయాలి


ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: స్వయం ఉపాధిలో భాగంగా డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న వస్తువులను కొనుగోలు చేయాలని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. నందిగామలో గురువారం ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పలు వస్తువులను ఎమ్మెల్యే కొనుగోలు చేసి మహిళలను ప్రత్యేకంగా అభినందించారు. కమిషనర్ రమణబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్వర్ణలత, తెదేపా పట్టణ అధ్యక్షుడు వై.రామకృష్ణ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు వెంకట్రావు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న పీఈటీ గోపీచంద్

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామలో గురువారం నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో కాకతీయ అపోలో ఉన్నత పాఠశాల బాలికలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్ తెలిపారు. అండర్-14 బ్యాడ్మింటన్ పోటీల్లో కె.లాస్యశ్రీ, ఎన్.హన్విమనస్వి, అండర్-17 విభాగం చెస్ పోటీల్లో టి.వైష్ణవి ఎంపికయ్యారని చెప్పారు. వారిని పాఠశాల డైరెక్టర్లు కార్తికేయ, సుష్మ, ప్రిన్సిపల్ సత్యమూర్తి, మేనేజరు కోటేశ్వరరావు, పీఈటీ గోపీచంద్ అభినందించారు.

ధర్నా జయప్రదానికి పిలుపు


కరపత్రాలు పంచుతున్న సీఐటీయూ నాయకులు

జగ్గయ్యపేట: క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలు నినాదాలతో ఈనెల 30న విజయవాడలో నిర్వహించే కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో సహా కర్మాగారాలు, ఇతర పని ప్రాంతాల్లోని కార్మికులకు కరదీపికలను అందించారు. మండల నాయకులు కోటరవి, రావెళ్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

లారీలు, బైక్‌ల దొంగల అరెస్టు


దొంగల వివరాలు వెల్లడించిన ఏసీపీ రవికిరణ్

నందిగామ, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాలు, లారీలు, ట్యాంకర్లు చోరీ చేస్తున్న దొంగల ముఠాను నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 12 టైర్ల లారీ, బైక్, నగదు రికవరీ చేశారు. నందిగామ పోలీసు స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికిరణ్ వివరాలు వెల్లడించారు. నందిగామ డీవీఆర్ కాలనీకి చెందిన కొమ్మూరు గోపీ, నెహ్రూనగర్‌కు చెందిన కమ్మవరపు నవీన్‌కుమార్, కాకాని నగర్‌కు చెందిన రంపా జాన్ ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారు. ఈ నెల 17న నందిగామ భారత్ టాకీస్ సెంటర్‌లో ఓ భవనం ప్రహరీ గేటు తాళం పగలగొట్టి ఖాళీ స్థలంలో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను దొంగిలించారు. ట్యాంకర్‌ను తెలంగాణ రాష్ట్రం మధిర సమీపంలోని ఎర్రుపాలెం గ్రామానికి తీసుకెళ్లి అందులోని ఆయిల్‌ను విక్రయించారు. ఈ నెల 23న నందిగామ మండలం మునగచర్ల గ్రామానికి సమీపంలోని హైవే పక్కనున్న హోటల్ వద్ద లారీని, ఈ నెల 16న నందిగామ పాతబస్టాండ్ వద్ద కొండ హోటల్ ముందు పెట్టిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఆయా ఘటనలపై నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్, డీసీపీ మహేశ్వరరాజు ఆదేశాల మేరకు నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో సీఐ వైవీవీఎల్‌నాయుడు, ఎస్సై శాతకర్ణి, సిబ్బంది దర్యాప్తు చేశారు. ఈ కేసులో సదరు ముగ్గురిని నిందితులుగా గుర్తించారు. వారిని నందిగామ మండలం జొన్నలగడ్డ గ్రామం వద్ద అరెస్టు చేసి నందిగామ కోర్టులో హాజరుపర్చారు. దొంగలను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులను కమిషనర్ రాజశేఖర్, ఏసీపీ రవికిరణ్‌లు అభినందించారు.

పెంపుడు కుక్క జ్ఞాపకార్థంగా బోరు ఏర్పాటు

చందర్లపాడు, న్యూస్‌టుడే : కోనాయపాలెంలో పెంపుడు కుక్క రాణి జ్ఞాపకార్థంగా యజమాని పారేపల్లి సత్యనారాయణ, కృష్ణకుమారిలు నడిమి డొంకలో తాగునీరు బోరును ఏర్పాటుచేశారు. దాన్ని నందిగామ ఏసీపీ రవికిరణ్, జడ్పీటీసీ మాజీ సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్‌లు గురువారం ప్రారంభించారు. పొలాలకు వెళ్లిన రైతులు దాహార్తి తీర్చుకోడానికి బోరు, సేదతీరటానికి అరుగును రూ.40 వేల వ్యయంతో నిర్మించారు. వాసిరెడ్డి విజయలక్ష్మి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

వంద రోజుల్లో చక్కటి పాలన అందించిన కూటమి ప్రభుత్వం

కృష్ణలంక, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చక్కటి ప్రణాళికతో ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 16వ డివిజన్ స్క్యూ బ్రిడ్జి కె హోటల్ సెంటర్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక నాయకులు, డివిజన్ తెదేపా అధ్యక్షుడు రత్నం రమేష్, వంద శివరామకృష్ణ, సింగంశెట్టి రమేష్, పువ్వాడ శ్రీనివాస్, నూతి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

పటమట, న్యూస్‌టుడే : సైబర్ నేరాలపై సచివాలయ మహిళా పోలీసులు అవగాహన కలిగి ఉండాలని, దీనిపై ప్రజలను చైతన్య పరచాలని సీఐలు పవన్ కిషోర్, జానకీ రామయ్య అన్నారు. గురువారం పటమట పోలీస్ స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని వార్డు సచివాలయ మహిళా పోలీసులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఎస్సై రేవతి, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

✦ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ ఆరో రోడ్డులో మురుగు డ్రెయినేజీ పొంగి ఇళ్లలోకి వస్తోందని స్థానిక నివాసి మాధవి మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఐహెచ్ శానిటరీ అధికారి ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పూడిక తీయించారు.

✦ 11వ డివిజన్ ఏపీఐఐసీ కాలనీ 11-5/53 విద్యుత్తు స్తంభానికి ఉన్న దీపం వెలగడంలేదని స్థానిక నివాసి పాతూరి సాంబశివరావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేశారు.

? రెండో డివిజన్ కార్మిక నగర్ కొండ పైన అమ్మవారి గుడి సమీపంలో తాగునీటి పైపు పగిలి నీరంతా వృథా అవుతోంది. - మురళి

✔ మరమ్మతులు చేయిస్తాం (నాగేశ్వరరావు, ఏఈ)

– న్యూస్‌టుడే, కరెన్సీనగర్

2047 నాటికి రాష్ట్రాన్ని వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కృష్ణలంక: ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారిస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాలా భారతదేశంలో ఓ కీలక వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర@2047 దార్శనిక పత్రాన్ని రూపొందిస్తోందని సీపీవో వై.శ్రీలత తెలిపారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం ఆమె ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చిమ్మచీకట్లో చిరుదీపం

వరద బాధితుల ఖాతాలకు జమైన పరిహారం

ప్రభుత్వం ఆదుకుందంటూ కృతజ్ఞతలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వరదల కారణంగా నగర ప్రజలు విలవిల్లాడిపోయారు. నియోజకవర్గంలోని రామలింగేశ్వరనగర్, భూపేష్‌గుప్తానగర్, తారకరామనగర్, రణదివే ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్లు మునిగిపోయాయి. గృహోపకరణాలు, అనేక వస్తువులు, పరికరాలు పనికిరాకుండా పోయాయి. నీటిలో ఉండడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు మొరాయించాయి. చిరువ్యాపారులు చితికిపోయారు. ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. ప్రజలకు జరిగిన నష్టాన్ని చూసి స్పందించారు. ధైర్యంగా ఉండాలని.. పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇల్లు మునిగిన వారికి రూ.25వేలు, మొదటి అంతస్తులో ఉన్న వారికి రూ.10వేలు, కిరాణా దుకాణాలు, తోపుడు బళ్ల వ్యాపారులకు ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమచేశారు. ఇచ్చిన హామీ ప్రకారం పరిహారం అందించి కష్ట కాలంలో చంద్రబాబుగారు అండగా నిలిచారని బాధితులు పేర్కొంటున్నారు.

అండగా నిలిచారు



వరదలకు మా ఇల్లు మునిగిపోయింది. సామగ్రి, మంచాలన్నీ రోజుల పాటు నీటిలో ఉండడం వల్ల పాడైపోయాయి. మళ్లీ కొత్తవి కొనుగోలు చేయాల్సిందే. ప్రకృతి వైపరీత్యాలతో ఇలాంటి విపత్తు వచ్చింది. దీనికి ఎవర్నీ బాధ్యులను చేయలేం. ఎంతో మంచి మనసుతో చంద్రబాబు రూ.25 వేలు పరిహారం అందించి అండగా నిలిచారు. వీటితో అవసరమైన వస్తువులను కొనుగోలు చేస్తా.

- పి.రత్న, ప్రైవేట్ ఉద్యోగి

మమ్మల్ని ఆదుకున్నారు



కొన్నేళ్ల నుంచి రామలింగేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్నా. వరదలు వచ్చినప్పుడు మేము ఉంటున్న గృహాలు ముంపునకు గురయ్యాయి. చూసి వెళ్లడమే గాని ఆదుకున్న వాళ్లు లేరు. ఇప్పుడు కూడా ఏం చేయరు అనుకున్నా. రూ.25వేల పరిహారం ఇస్తారని ఊహించలేదు. కష్టాల్లో ఉన్న మమ్ముల్ని ఆదుకున్నందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- టి.కృష్ణమూర్తి

హామీ నిలబెట్టుకున్నారు



అంత వస్తాం.. ఇంత ఇస్తాం అని నాయకులు చెబుతుంటారు. అవి లెక్క మాత్రం చేయరు. ఇప్పుడు కూడా అలానే ఉంటుందని భావించాను. చంద్రబాబు మాత్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఇల్లు మునిగిన వారికి రూ.25వేలు పరిహారాన్ని ఇస్తానని ప్రకటించారు. పది రోజుల్లోనే మా ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి.

- కృష్ణబాయమ్మ, వృద్ధురాలు

ఊహించని విపత్తు



ఎగువ నుంచి కృష్ణానదికి ఊహించని విధంగా వరద వచ్చింది. రక్షణ గోడ ఉన్నా మా గృహాలు మునిగిపోయాయి. ఇంత విపత్తును ఊహించలేదు. ఇంట్లో సామగ్రి మొత్తం మునిగి పనికిరాకుండా పోయింది. మేమున్నామంటూ ప్రభుత్వం ముందుకొచ్చి కొంత ఆర్థిక సాయాన్ని అందించి మాకు అండగా నిలిచింది.

- ఓ.జ్యోతి, గృహిణి

బాబు సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి



కృష్ణానది పరీవాహ ప్రాంతంలో నివసిస్తున్నాం. తరచూ వరదలు వస్తుంటాయి. చూసి వెళ్లడం గాని మమ్మల్ని ఆదుకున్నది లేదు. ముంపు సమయంలో పునరావాస కేంద్రానికి తరలించారు. తరువాత వచ్చాం. అగ్నిమాపక సిబ్బందిని పంపించి ఇళ్లు శుభ్రం చేయించారు. ఇంత పరిహారం ఇస్తారు అని అనుకోలేదు. రూ.25వేలు వచ్చాయి. వరద బాధితులకు సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించడంలో చంద్రబాబు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

- సుకన్య, గృహిణి

చంద్రబాబు భరోసా ఇచ్చారు



వరదలకు మా ఇల్లు మునిగిపోయింది. అక్కడ నుంచి బయటకు వచ్చేశాం. వరదల సమయంలో ఆహార పొట్లాలు, పాలప్యాకెట్లు ఇలా వివిధ రూపాల్లో సాయం అందించి ఆకలి తీర్చారు. ముంపు ప్రాంతాలకు వెళ్లాలంటే ధైర్యం చేయడం లేదు. అలాంటి సమయంలో ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా చంద్రబాబు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. మా ఇబ్బందులను గుర్తించి తక్కువ వ్యవధిలోనే ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

- వి.ప్రేమ్‌కుమార్, ఆటోడ్రైవర్

కార్మికుల సంపాదన మెరుగుపడేలా కార్యాచరణ



నూతన పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆటోనగర్, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో ఆటోనగర్ పూర్తిగా నిర్వీర్యం కావడంతో కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు అండగా ఉంటుందని, సాంకేతిక నైపుణ్యాల పరంగా కావాల్సిన శిక్షణ అందించి వారి సంపాదన మెరుగుపడేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆటోమొబైల్స్ టెక్నీషియన్ అసోసియేషన్(ఏటీఏ) హాల్‌లో ఏటీఏ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా రాజనాల వెంకట రమణారావు(బాబ్జి), కార్యదర్శిగా రావి రామచంద్రరావు, కోశాధికారిగా సయ్యద్ షా సాహెబ్ హుస్సేన్‌తో పాటు 60 పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఐలా మాజీ ఛైర్మన్ సుంకర దుర్గ ప్రసాద్, పలు యూనియన్ నేతలు, ఏటీఏ సభ్యులు పాల్గొని నూతన పాలక వర్గాన్ని అభినందించారు.

విద్యుత్తు స్తంభాల తొలగింపు



సర్వీస్‌రోడ్డులో తొలగిస్తున్న విద్యుత్తు స్తంభాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలను గురువారం తొలగించారు. గత వారంలో అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పించిన అధికారులు తాజాగా తీగలు, స్తంభాలు మార్పిడి చేశారు. దీంతో కొంత కాలంగా అసంపూర్తిగా ఉన్న విద్యుత్తు శాఖ పనులు పూర్తయ్యాయి. రెండు నెలల కిందట రమేష్ ఆసుపత్రి జంక్షన్‌లో ఓ వ్యాపార సముదాయానికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు అడ్డుగా ఉందంటూ 'ఈనాడు'లో కథనాలు వచ్చాయి. శాఖల మధ్య సమన్వయం కొరవడడంతో పనులు కొలిక్కి రాలేదు. ప్రజాప్రతినిధుల జోక్యం ఎట్టకేలకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి జరగ్గా, తాజాగా స్తంభాలు తొలగించారు. ఇక హైవే అథారిటీ వారిచే రహదారి విస్తరణ పనులు మొదలు కావాల్సి ఉంది.

పతకాలు సాధించేలా శిక్షణనివ్వాలి



వీఎంసీ క్రీడా సిబ్బంది సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని పతకాలు సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ)ప్రధాన కార్యాలయంలో గురువారం కమిషనర్ ఛాంబర్‌లో వీఎంసీ క్రీడా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని క్రీడా స్టేడియాలు, వ్యాయామశాలలు, ఈత కొలనుల్లో విద్యార్థులకు, ప్రజలకు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు వచ్చేలా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి టి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు రామ్మోహన్, శ్రీరామచంద్రమూర్తి, వ్యాయామశాలల శిక్షకులు, స్విమ్మింగ్ కోచ్‌లు, స్టేడియాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాల్లో స్వచ్ఛతా హీ సేవ

భారీ మువ్వన్నెల జెండాతో గాంధీకొండ కళకళ



త్రివర్ణ పతాకంతో కళకళలాడిన గాంధీ కొండ

చిట్టినగర్, న్యూస్‌టుడే: నగరానికి మంచి పేరు ప్రతిష్ఠలు పెరగాలంటే చారిత్రక ప్రదేశాలలో స్వచ్ఛత సేవ అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. పాతబస్తీలోని గాంధీకొండపై స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. గాంధీ కొండ, మొగల్రాజపురంలోని గుహల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో శ్రమదానం ద్వారా వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 300 అడుగుల పొడవైన జాతీయ జెండాలను విద్యార్థులు చేతపట్టుకుని గాంధీ కొండ దిగువ నుంచి కొండపైకి ర్యాలీ ఆకట్టుకుంది. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ భారత్‌పై 400 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రజలకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. బుర్రకథ ద్వారా అర్థమయ్యే విధంగా స్వచ్ఛతను వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవతి, సీఎంహెచ్‌వో రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్యకీర్తన, ప్రభుతాస్, ఏఎంహెచ్‌వోలు డాక్టర్ సురేష్, డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, 3 సర్కిల్స్ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

డైనమిక్ స్కూల్ అవార్డుకు ఎంపిక



అవార్డు అందుకుంటున్న రవీంద్ర భారతి గ్రీన్ స్కూల్ ప్రతినిధి

కానూరు, న్యూస్‌టుడే : పోరంకి రవీంద్ర భారతి గ్రీన్ స్కూల్‌కు ఎడ్యుకేషన్ టుడే సంస్థ ప్రతిష్ఠాత్మకమైన డైనమిక్ స్కూల్ అవార్డును అందజేసింది. గురువారం ఆ సంస్థ ప్రతినిధులు పాఠశాలలో ఈ అవార్డును అందజేశారు. పాఠశాల ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో విద్యను అభ్యసించాలన్న ఆలోచనను ఆవిష్కరించడం వల్ల ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి సంపూర్ణ విద్యను అందించడంలో నిబద్ధతను చూపడం, డైనమిక్ లెర్నింగ్‌ను మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా అందించడం కూడా దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతిలను ఎడ్యుకేషన్ టుడే ప్రతినిధులు అభినందించారు.



రవినాయుడుకు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

క్రీడా శాఖ మంత్రితో శాప్ ఛైర్మన్ భేటీ

విజయవాడ క్రీడలు: రాష్ట్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శాప్ నూతన ఛైర్మన్‌గా నియమితులైన రవినాయుడు మర్యాదపూర్వకంగా గురువారం నగరంలోని మంత్రి విడిది కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు క్రీడలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం రవినాయుడును మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన వెంట పోలవరం నియోజకవర్గ తెదేపా యూత్ అధ్యక్షుడు సురేంద్రనాథ్ చౌదరి, అనంతపురం జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి బాల లోకేష్ యాదవ్, తెలుగు యువత అధికార ప్రతినిధి చీరాల నరేష్ ఉన్నారు.

మహిళా ఫుట్‌బాల్ విజేత అనంతపురం



తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లతో బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : కానూరులోని అనుమోలు ప్రభాకర్ గార్డెన్స్ మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లా జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మూడో రోజైన గురువారం జరిగిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీ సత్యసాయి, కర్నూలు జట్లు తలపడ్డాయి. షూటౌట్స్‌లో శ్రీ సత్యసాయి జట్టు 5-3 గోల్స్ తేడాతో కర్నూలుపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించింది. తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 2-0 గోల్స్ తేడాతో కర్నూలుపై గెలుపొందింది. సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 4-0 గోల్స్ తేడాతో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై విజయాన్ని నమోదు చేసుకుంది. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా, కె.బాలకృష్ణ గౌరవ అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్, అనుమోలు ప్రభాకర్ జట్టు ఎంపిక కమిటీ సభ్యులు పి.ఆలీబాబా, ఎస్.అప్పారావు, కోనసీమ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వై.నీలాద్రి, రాష్ట్ర సంఘం కోశాధికారి వి.విజయ్‌కుమార్, మ్యాచ్ కమిషనర్ ఎండీ సిరాజుద్దీన్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న కృష్ణా జిల్లా విశ్రాంత వ్యవసాయ పట్టభద్రుల సంఘం సభ్యులు

సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం

పటమట, న్యూస్‌టుడే : వరద బాధితులను ఆదుకునేందుకు కృష్ణా జిల్లా విశ్రాంత వ్యవసాయ పట్టభద్రుల సంఘం సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు గురువారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను అసోసియేషన్ సభ్యులు కలిసి రూ.లక్ష చెక్కు అందజేశారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు. సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

కృష్ణలంక, న్యూస్‌టుడే : దున్నేవాడిదే భూమి అనే నినాదంతో నైజాం పాలనలో పేదల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేపట్టి పెత్తందార్ల గుత్తాధిపత్యాన్ని నిరసించిన ధీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శమని రజక అభ్యుదయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు మధు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కృష్ణలంక బర్మాసీతారామయ్య ప్రాథమిక పాఠశాలలో గురువారం ఐలమ్మ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు రాత పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. సంఘ సభ్యులు నీలాపు సురేంద్ర, గణపవరపు వేణు, ఈశ్వరరావు, సాంబయ్య, మల్లేశ్వరరావు, శేషగిరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సంఘం ఆధ్వర్యంలో పలు చోట్ల జయంతి వేడుకలు నిర్వహించారు.

ఓ జనరల్ ఏసీ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు పూవయ్య, తకేషి హరుకి తదితరులు

ఆటోనగర్, న్యూస్‌టుడే : స్థానిక ఆటోనగర్ గేట్ సమీపంలో ఫుజిత్సు జనరల్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన జనరల్ ఆర్కేడ్(ఓ జనరల్) ఏసీ షోరూమ్‌ను గురువారం సంస్థ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్లు కె.సి.పూవయ్య, తకేషి హరుకిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే ఏసీల్లో ఓ జనరల్ అగ్రగామిగా ఉందన్నారు. 0.8 టన్నుల కెపాసిటీ నుంచి 4 టన్నుల వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ కంపెనీ ఏసీలు ప్రపంచంలో 100కు పైగా దేశాల్లో వినియోగంలో ఉన్నట్లు పేర్కొన్నారు. మార్కెటింగ్ సిబ్బంది, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్ల వద్ద ప్రిన్సిపల్ సునీత, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : వరద బాధితులను ఆదుకునేందుకు సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ముందుకొచ్చారు. సేకరించిన రూ.లక్షతో దుప్పట్లు కొనుగోలు చేశారు. వాటిని జక్కంపూడి కాలనీ, అజిత్‌సింగ్ నగర్, లూనా కాలనీ, రామలింగేశ్వరనగర్‌లో గురువారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచంటి సునీత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పసిడి పతకాలతో గంగామోహన్, తిరుమలైకుమార్, బాజి నాగుల్ మీరా, చరణ్‌రెడ్డి

ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో విజేత ద.మ.రైల్వే జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : చిత్తరంజన్‌లోని చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ (సీఎల్‌డబ్ల్యు)లో ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 14వ ఆలిండియా రైల్వే ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ద.మ.రైల్వే పురుషుల కాంపౌండ్ జట్టు విజేతగా నిలిచింది. జట్టులోని సభ్యులంతా విజయవాడ డివిజన్‌కు చెందినవారు కావడం గర్వకారణం. పర్సనల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వై.చరణ్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ట్రైన్ లైటింగ్‌లో సహాయకుడిగా పనిచేసే జి.బాజి నాగుల్ మీరా, బుకింగ్ సూపర్‌వైజర్ ఎస్.తిరుమలైకుమార్, ట్రైన్ మేనేజర్ జె.గంగామోహన్‌లతో కూడిన ద.మ.రైల్వే జట్టు ఫైనల్స్‌లో 240-218 స్కోర్ తేడాతో నార్త్ ఈస్టన్ రైల్వే జట్టుపై విజయం సాధించి పసిడి పతకాలు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ (ఆర్పీఎఫ్), డివిజనల్ స్పోర్ట్స్ అధికారి వల్లేశ్వర బి.తోకల, ఇతర శాఖాధికారులు విజేతలను అభినందించారని డీఆర్ఎం కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

నిందితులను అరెస్ట్ చేయాలి



కృష్ణలంకలో హైందవ జాగృత సమితి సభ్యుల నిరసన

కృష్ణలంక, న్యూస్‌టుడే : తితిదే స్వామి వారి ప్రసాదం కల్తీ అపచారంలో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ హైందవ జాగృత సమితి సభ్యులు నిరసన తెలిపారు. కృష్ణలంకలో గురువారం చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. హిందూ దేవాలయాల్లో పనిచేస్తున్న అన్య మతస్తుల్ని వేరే శాఖలకు బదిలీ చేసి తితిదేలో జరుగుతున్న హిందూ వ్యతిరేక విధానాలపై చర్యలు చేపట్టాలన్నారు. సభ్యులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున గుప్తా, శ్రీనివాస్, శివయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబా ఫూలే ఆశయాల స్ఫూర్తితో పోరాటం



మాట్లాడుతున్న పోలారి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : ఏ దేశంలో లేని కుల వ్యవస్థ భారత్‌లోనే ఉందని ఇప్పటికీ కుల హత్యలు జరగడం సిగ్గుచేటని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కె.పోలారి అన్నారు. జ్యోతిబా ఫూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రీస్తురాజపురంలోని రామనర్సయ్య భవన్‌లో గురువారం పార్టీ నగర కార్యదర్శి ఎ.రవిచంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.గంగా భవానీ మాట్లాడుతూ కుల వివక్షతతో పాటు దళితులు, మహిళలు, ఆదివాసీలు.. అణచివేతకు, దోపిడీకి గురవుతున్నారన్నారు. జ్యోతిబా ఫూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.పద్మ, మునిశంకర్, దాది శ్రీనివాసరావు, ఐ.రాజేష్ తదితరులున్నారు.

విజయవాడ పశ్చిమ

చారిత్రక ప్రదేశాల్లో స్వచ్ఛతా హీ సేవ

భారీ మువ్వన్నెల జెండాతో గాంధీకొండ కళకళ



త్రివర్ణ పతాకంతో కళకళలాడిన గాంధీకొండ

చిట్టినగర్, న్యూస్‌టుడే: నగరానికి మంచి పేరు ప్రతిష్ఠలు పెరగాలంటే చారిత్రాత్మక ప్రదేశాల్లో స్వచ్ఛత సేవ అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. పాతబస్తీలోని గాంధీకొండపై స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గాంధీ కొండ, మొగల్‌రాజపురంలోని గుహల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో శ్రమదానం ద్వారా వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 300 అడుగుల పొడవైన జాతీయ జెండాను విద్యార్థులు చేతపట్టుకుని గాంధీ కొండ దిగువ నుంచి కొండపైకి ర్యాలీ ఆకట్టుకుంది. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ భారత్‌పై 400 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రజలకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. బుర్రకథ ద్వారా అర్థమయ్యే విధంగా స్వచ్ఛతను వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవతి, సీఎంహెచ్‌వో రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్యకీర్తన, ప్రభుదాస్, ఏఎంహెచ్‌వోలు డాక్టర్ సురేష్, డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, 3 సర్కిల్స్ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

పటమట, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై సచివాలయ మహిళా పోలీసులు అవగాహన కలిగి ఉండాలని, దీనిపై ప్రజలను చైతన్య పరచాలని సీఐలు పవన్ కిషోర్, జానకి రామయ్య అన్నారు. గురువారం పటమట పోలీస్ స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని వార్డు సచివాలయ మహిళా పోలీసులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఎస్సై రేవతి, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు కొండంత భరోసా

బ్యాంకు ఖాతాల్లోకి సాయం | వరద బాధితుల్లో ఆనందం

భవానీపురం, విద్యాధరపురం, చిట్టినగర్, న్యూస్‌టుడే

బుడమేరు వరద కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది ఇటీవల సర్వే చేసి ఎన్యూమరేషన్ చేశారు. బాధితులకు బుధవారం ముఖ్యమంత్రి బాధితుల్లో కొందరికి నగదు జమ చేసిన ధ్రువీకరణ పత్రం అందించారు. గురువారం ముంపు బాధితులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దిగువ అంతస్తుల్లో నివాసం ఉండే వారికి రూ.25 వేలు, పై అంతస్తుల్లో ఉన్న వారికి రూ.10 వేలు చొప్పున, వాహనాల మరమ్మతుల కోసం రూ.3 వేలు సాయం అందుతోందని పలువురు బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సామాన్లు దెబ్బతిన్నాయి..



జక్కంపూడి కాలనీలో మేము దిగువ అంతస్తులో నివాసం ఉంటున్నాం. వరద కారణంగా వారం రోజుల పాటు నీరు నిలిచి ఉంది. తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇంట్లోని సామాన్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రూ.25 వేలు ఖాతాలో జమ చేసింది. చాలా సంతోషంగా ఉంది. - **కాళ్ల సన్యాసిరావు (జక్కంపూడికాలనీ)**

ప్రభుత్వ స్పందనకు కృతజ్ఞత..



వరద కారణంగా రామరాజ్య నగర్‌లోని దిగువన ఉన్న నివాసాలు పూర్తిగా నీట మునిగాయి. కొన్ని రోజుల పాటు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వరద తగ్గడంతో ఇంట్లోని సామాన్లు దెబ్బతిన్నాయి. ఫ్రిజ్, మంచం, టీవీ, చాలా వరకు పాడైయ్యాయి. ప్రభుత్వం జమ చేసిన నగదు సామాన్లు మరమ్మతులు చేయించుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం స్పందించిన తీరు చక్కగా ఉంది. - **మహ్మద్ రజియా(రామరాజ్య నగర్)**

హామీ ఇచ్చారు.. ఆదుకున్నారు



మేము కేఎల్‌రావు నగర్‌లో ఉంటున్నాం. వరదకు మా ఇల్లంతా మునిగి పోయింది. ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ద్విచక్ర వాహనం, ఆటో నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. సీఎం చంద్రబాబు పూర్తిగా న్యాయం చేశారని భావిస్తున్నాను. ఇంటికి రూ.25వేలు, ఆటోకి రూ.10 వేలు, ద్విచక్ర వాహనానికి రూ.3 వేలు మొత్తం రూ.38 వేలు మా ఖాతాకి జమ అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది. - **పోలిశెట్టి సృజన, కేఎల్‌రావునగర్**

చాలా ఆనందంగా ఉంది



వరదకు మాకు చాలా నష్టం జరిగింది. ఇబ్బంది పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వరద బాధితులను ఆదుకుంటామని భరోసాతో ఉపశమనం కలిగింది. దిగువ అంతస్తు పూర్తిగా మునిగిపోవడంతో చెప్పిన విధంగానే రూ.25 వేలు, ద్విచక్ర వాహనం మరమ్మతులకు రూ.3 వేలు నా బ్యాంకు ఖాతాకు జమ అయ్యాయి. ఇంత పెద్ద విపత్తులో గుర్తించి ఆదుకోవడం నేను ఎన్నడు చూడలేదు. - **గుగ్గిలం విజయ్‌కుమార్, సిండికేటు బ్యాంకు కాలనీ**

ఆత్మస్థైర్యాన్ని నింపింది



వారం రోజుల పాటు వరద నీరు ఇంట్లో తిష్ట వేసింది. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, వాషింగ్ మిషను, మంచాలు, ద్విచక్రవాహనం నీటమునగడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ప్రభుత్వం పాలు, ఆహారం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర ఉండి ప్రతి డివిజన్‌లో బాధితులకు అండగా నిలుస్తాం అని చెప్పడం ఆత్మస్థైర్యాన్ని నింపింది. రూ.25 వేలతో పాటు ద్విచక్రవాహనం మరమ్మతుకు రూ.3 వేలు అందించడం అభినందనీయం. - **ఖతీజా, లేబరుకాలనీ**

స్ఫూర్తిదాయకం



వరద వచ్చిన వెంటనే ప్రభుత్వ స్పందన స్ఫూర్తిదాయకం. వరద తీవ్రతపై అప్రమత్తం చేయడంతో పాటు 13 జిల్లాల నుంచి అధికారులను పిలిపించి సహాయక చర్యలు చేపట్టడం గతంలో ఎన్నడూ జరగలేదు. ఒకవైపు రక్షణ చర్యలు, మరొక వైపు సహాయం, నష్టపరిహారం అందించేందుకు తీసుకున్న చర్యలు జీవితంలో మరిచి పోలేం. రూ.25 వేలు బ్యాంకు ఖాతాలో జమ కావడంతో సమర్థ పాలనకు నిదర్శనం. - **మధులత, చెరువు సెంటరు**

సాయం లేకుంటే కోలుకోవడం కష్టం



వరదనీటి కారణంగా దుకాణంలో సరకు మొత్తం మునిగిపోయింది. గోడలు, ఫ్లోరింగ్ కూడా పాడైపోయింది. ట్రేడ్ లైసెన్సు చూసి సచివాలయ సిబ్బంది ఎన్యూమరేషన్ చేశారు. నష్టం రూ.1 లక్షకు పైగా ఉంటుంది. సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నుంచి రూ.25 వేలు వస్తాయని చెబుతున్నారు. తమను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందన్న నమ్మకం ఉంది. - **మురళీ, చిల్లర కొట్టు**

ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింల పక్షపాతి



ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఫరూక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ముస్లింలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తూ వారి పక్షపాతిగా చంద్రబాబు నిలిచారని తెదేపా మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహ్మద్ ఫతావుల్లా అన్నారు. గురువారం కొత్తపేట, గణపతిరావు రోడ్డులోని ఖిద్మత్‌ఘర్ కార్యాలయం వద్ద విజయవాడ పార్లమెంటు మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు తమీమ్ అన్సర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదు ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజనులకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇవ్వడం, మసీదులు నిర్వాహణకు రూ.5 వేలు మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జహెద్, రజావుల్లా, కరీముల్లా, తాజుద్దీన్, నహీద్, వాజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి రాష్ట్రాన్ని వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కృష్ణలంక, న్యూస్‌టుడే : ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారిస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాలా భారత్‌కు ఓ కీలక వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర @ 2047 దార్శనిక పత్రాన్ని రూపొందిస్తోందని సీపీవో వై.శ్రీలత తెలిపారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం ఆమె ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు వివిధ భాగస్వామ్య పక్షాలతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన ప్రజలతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాల నుంచి సూచనలు, సలహాలు, స్పందనలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వ దోష నివారణకు శాంతి హోమాలు



శాంతి హోమం నిర్వహిస్తున్న రుత్వికులతో ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: సర్వ దోష నివారణార్థం ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం శాంతి హోమం నిర్వహించారు. అన్ని ప్రముఖ దేవాలయాల్లో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్న సంకల్పంతో శాంతి హోమాన్ని చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. యాగశాలలో దేవస్థానం ఈవో రామారావు దంపతులతో స్థానాచార్య శివప్రసాద శర్మ గణపతి పూజ చేయించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ హోమాన్ని రుత్వికులు నిర్వహించారు.



నృత్య ప్రదర్శనలో కళాకారిణులు

అలరించిన కూచిపూడి నృత్యం

విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన కూచిపూడి నాట్యాచారిణి కోట సరిత శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను గురువారం అలరించింది. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు ఆసక్తిగా ప్రదర్శనను తిలకించారు. వారికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

లడ్డూ పవిత్రతను కాపాడాలి



ర్యాలీలో దళితసేన నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఎంతో పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకానికి పాల్పడిన వారిపై కఠినంగా శిక్షించాలని 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ కోరారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదం అపవిత్రతకు నిరసనగా దళిత సేన ఆధ్వర్యంలో ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి పవిత్రతను కాపాడి భక్తులకు మనోధైర్యాన్ని కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న చర్యల పట్ల ప్రజలు మద్దతుగా నిలిచారని అన్నారు. అనంతరం చిట్టినగర్ నుంచి రథం సెంటర్ వరకు దళితసేన నిరసన ర్యాలీ సాగింది. కార్యక్రమంలో దళితసేన నాయకులు పోతురాజు కిరణ్, భాజపా నాయకులు పోతిన భేసుకంతేశ్వరుడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భవానీపురం: 8008574638

స్పందనకు వందనం

★ జక్కంపూడి కాలనీలో తాగునీటి సమస్య ఉందని, నీరు సరిగా రావడం లేదంటూ నగరపాలక సంస్థ నీటి సరఫరా విభాగం ఏఈ అహ్మద్ దృష్టికి తీసుకువెళ్లగా.. సిబ్బందిని పంపి పైపులైన్లకు మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం నీరు సక్రమంగా సరఫరా అవుతున్నాయి.

★ హెచ్‌బీ కాలనీలోని వీధుల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయంటూ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లగా శుభ్రం చేశారు. ★ భవానీపురం స్వాతి కూడలి వద్ద ట్రాఫిక్ నిలిచిపోతుందని సిబ్బందిని నియమించాలంటూ ట్రాఫిక్ సీఐ సురేష్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దీంతో సిబ్బందిని నియమించి వాహనాలు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ★ ఊర్మిళానగర్ ప్రాంతంలో రహదారులపై నీరు నిలిచి ఉందంటూ నగరపాలక సంస్థ ఈఈ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లాగా.. ఆయన సిబ్బందిని పంపి నీరు నిలిచి ఉండకుండా చర్యలు చేపట్టారు. - **న్యూస్‌టుడే, భవానీపురం**

‘అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా శిక్షణనివ్వాలి’



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని పతకాలు సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ)ప్రధాన కార్యాలయంలో గురువారం కమిషనర్ ఛాంబర్‌లో వీఎంసీ క్రీడా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని క్రీడా స్టేడియాలు, వ్యాయామశాలలు, ఈత కొలనుల్లో విద్యార్థులకు, ప్రజలకు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు వచ్చేలా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి టి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు రామ్మోహన్, శ్రీరామచంద్రమూర్తి, వ్యాయామశాలల శిక్షకులు, స్విమ్మింగ్ కోచ్‌లు, స్టేడియాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న నారాయణరావు, ఫిజికల్ డైరెక్టర్లు హేమచంద్రరావు, నారాయణరావు తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థితిలో ఉంటారని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో వి.నారాయణరావు అన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో ఎస్‌జీఎస్ అండర్-19 బాలబాలికల హ్యాండ్‌బాల్, చదరంగం ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అండర్-19 ఉన్న క్రీడాకారులందరూ క్రీడల్లో మంచి ప్రతిభను చూపాలని అన్నారు. రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చేందుకు శ్రమించాలని సూచించారు. సీనియర్ ఫిజికల్ డైరక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ.. అండర్-19కి సంబంధించి జిల్లా నుంచి గతంలో ఎంపికైన విద్యార్థులు అనేక విజయాలు సొంతం చేసుకున్నారని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ పీఎల్.రమేష్ మాట్లాడుతూ.. చదరంగంలో అంతర్జాతీయ ర్యాంకర్ జ్యోతికిరణ్ ఆర్బిట్‌గా వ్యవహరించగా, హ్యాండ్‌బాల్‌కి కళాశాల క్రీడావిభాగాధిపతి డి.హేమచంద్రరావు ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ కొనసాగినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.విజయ్‌బాబు, ఫైన్ కళాశాల డైరక్టర్ టి.నరేంద్ర, పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మార్కండేయులు పాల్గొన్నారు.

డైనమిక్ స్కూల్ అవార్డుకు ఎంపిక



అవార్డు అందుకుంటున్న రవీంద్ర భారతి గ్రీన్ స్కూల్ ప్రతినిధి

కానూరు, న్యూస్‌టుడే : పోరంకి రవీంద్ర భారతి గ్రీన్ స్కూల్‌కు ఎడ్యుకేషన్ టుడే సంస్థ ప్రతిష్ఠాత్మకమైన డైనమిక్ స్కూల్ అవార్డును అందజేసింది. గురువారం ఆ సంస్థ ప్రతినిధులు పాఠశాలలో ఈ అవార్డును అందజేశారు. పాఠశాల ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో విద్యను అభ్యసించాలన్న ఆలోచనను ఆవిష్కరించడం వల్ల ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి సంపూర్ణ విద్యను అందించడంలో నిబద్ధతను చూపడం, డైనమిక్ లెర్నింగ్‌ను మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా అందించడం కూడా దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతిలను ఎడ్యుకేషన్ టుడే ప్రతినిధులు అభినందించారు.

వార్డుల్లోని సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర, చిత్రంలో అధికారులు

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ నగర పరిధిలోని వార్డుల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, శాఖాధిపతులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని 64 వార్డులకు 64 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్య ప్రత్యేక అధికారుల దృష్టిలో ఉండాలన్నారు. సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం



నూతన పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆటోనగర్, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో ఆటోనగర్ పూర్తిగా నిర్వీర్యం కావడంతో కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు అండగా ఉంటుందని, సాంకేతిక నైపుణ్యాల పరంగా కావాల్సిన శిక్షణ అందించి వారి సంపాదన మెరుగుపడేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆటోమొబైల్స్ టెక్నీషియన్ అసోసియేషన్(ఏటీఏ) హాల్‌లో ఏటీఏ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా రాజనాల వెంకట రమణారావు(బాబ్జి), కార్యదర్శిగా రావి రామచంద్రరావు, కోశాధికారిగా సయ్యద్ షా సాహెబ్ హుస్సేన్‌తో పాటు 60 పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఐలా మాజీ ఛైర్మన్ సుంకర దుర్గ ప్రసాద్, పలు యూనియన్ నేతలు, ఏటీఏ సభ్యులు పాల్గొని నూతన పాలక వర్గాన్ని అభినందించారు.

సోదరుడు కనిపించడం లేదని ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: అన్న కనిపించడం లేదంటూ తమ్ముడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి...విద్యాధరపురం లేబర్‌కాలనీలో సాయి సందీప్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈనెల 24వ తేదీన అన్నయ్య శ్రీకాంత్ (26) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తమ్ముడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్చరీ ఛాంపియన్‌షిప్ విజేత ద.మ.రైల్వే జట్టు



పసిడి పతకాలతో గంగామోహన్, తిరుమలైకుమార్, బాజి నాగుల్ మీరా, చరణ్‌రెడ్డి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : చిత్తరంజన్‌లోని చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ (సీఎల్‌డబ్ల్యూ)లో ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 14వ ఆలిండియా రైల్వే ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ద.మ.రైల్వే పురుషుల కాంపౌండ్ జట్టు విజేతగా నిలిచింది. జట్టులోని సభ్యులంతా విజయవాడ డివిజన్‌కు చెందినవారు కావడం గర్వకారణం. పర్సనల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వై.చరణ్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ట్రైన్ లైటింగ్‌లో సహాయకుడిగా పనిచేసే జి.బాజి నాగుల్ మీరా, బుకింగ్ సూపర్‌వైజర్ ఎస్.తిరుమలైకుమార్, ట్రైన్ మేనేజర్ జె.గంగామోహన్‌లతో కూడిన ద.మ.రైల్వే జట్టు ఫైనల్స్‌లో 240-218 స్కోర్ తేడాతో నార్త్ ఈస్ట్రన్ రైల్వే జట్టుపై విజయం సాధించి పసిడి పతకాలు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం నరేంద్ర ఎ.పాటిల్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ (ఆర్పీఎఫ్), డివిజనల్ స్పోర్ట్స్ అధికారి వల్లేశ్వర బి.తోకల, ఇతర శాఖాధికారులు విజేతలను అభినందించారని డీఆర్‌ఎం కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్ అనంతపురం



విజేతలతో బాలకృష్ణ, ముని శ్రీనివాస్, ఆలీబాబా, అప్పారావు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : కానూరులోని అనుమోలు ప్రభాకర్ గార్డెన్స్ మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లా జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మూడో రోజైన గురువారం జరిగిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీ సత్యసాయి, కర్నూలు జట్లు తలపడ్డాయి. షూటౌట్స్‌లో శ్రీ సత్యసాయి జట్టు 5-3 గోల్స్ తేడాతో కర్నూలుపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించింది. తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 2-0 గోల్స్ తేడాతో కర్నూలుపై గెలుపొందింది. సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 4-0 గోల్స్ తేడాతో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై విజయాన్ని నమోదు చేసుకుంది. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా, కె.బాలకృష్ణ గౌరవ అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్, అనుమోలు ప్రభాకర్ జట్టు ఎంపిక కమిటీ సభ్యులు పి.ఆలీబాబా, ఎస్.అప్పారావు, కోనసీమ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వై.నీలాద్రి, రాష్ట్ర సంఘం కోశాధికారి వి.విజయ్‌కుమార్, మ్యాచ్ కమిషనర్ ఎండీ సిరాజుద్దీన్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

కృష్ణలంక, న్యూస్‌టుడే : దున్నేవాడిదే భూమి అనే నినాదంతో నైజాం పాలనలో పేదల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేపట్టి పెత్తందార్ల గుత్తాధిపత్యాన్ని నిరసించిన ధీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శమని రజక అభ్యుదయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు మధు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కృష్ణలంక బర్మాసీతారామయ్య ప్రాథమిక పాఠశాలలో గురువారం ఐలమ్మ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు రాత పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

భవానీపురం, న్యూస్‌టుడే: మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని నలంద కళాశాల ప్రిన్సిపల్ ఖాసింషా పేర్కొన్నారు. బైపాస్ రహదారి వెంబడి ఉన్న నలంద డిగ్రీ కళాశాల, పీజీ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ప్రదర్శన, మొక్కలను నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కాలుష్యం పెరిగిపోయి పర్యావరణానికి హాని జరుగుతుందని తెలిపారు. మొక్కలను పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. బైపాస్ రహదారిపై విద్యార్థులు ప్రదర్శనగా వెళ్లి అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ దినేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

విద్యుత్తు దీపాల ఏర్పాటు

సీతారాంపురం, న్యూస్‌టుడే : స్థానిక 23వ డివిజన్, పెద్దిబొట్లవారివీధిలోని విద్యుత్తు స్తంభం (23/98/679) వద్ద, అజిత్‌సింగ్‌నగర్ చేనేని గాంధీపురం రోడ్డులోని స్తంభాల (61/261/25, 61/261/89) దీపాలు వెలగడం లేదు. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. ఈ నెల 22న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వీఎంసీ ఏఈ విమల స్పందించారు. సిబ్బందితో దీపాలు ఏర్పాటు చేయించారు. మూడు చోట్ల సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

? పాయకాపురం ప్రశాంతినగర్ నాగేంద్రస్వామి పుట్ట రోడ్డులోని విద్యుత్తు దీపాలు వెలగడం లేదు.
- ఉష, స్థానికురాలు

✔ పరిశీలించి దీపాలు ఏర్పాటు చేస్తాం.
- విమల, ఏఈ, వీఎంసీ

– న్యూస్‌టుడే, సీతారాంపురం

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ నగర పరిధిలోని వార్డుల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, శాఖాధిపతులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని 64 వార్డులకు 64 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్య ప్రత్యేక అధికారుల దృష్టిలో ఉండాలన్నారు. సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రం

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : లెఫ్టినెంట్ కల్నల్ హరీష్‌పాండే ఆదేశాలతో సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎం పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులతో స్వచ్ఛత కార్యక్రమాలు ప్రారంభించినట్లు ఆ విభాగ అధికారి ప్రకాష్ తెలిపారు. గురువారం పరిసరాల్లోని వ్యర్థాలను సేకరించి, శుభ్రం చేశారు. వారం రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, విద్యా కమిటీ వైస్ ఛైర్మన్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

కొండంత భరోసా..!

వరద బాధితులకు ఆర్థిక సాయం

మధురానగర్, న్యూస్‌టుడే

బుడమేరు వరదతో సర్వం కోల్పోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం భరోసానిస్తోంది. ఇళ్లు మునిగిన కుటుంబాలకు నష్ట పరిహారం అందజేస్తోంది. నేరుగా ప్రజల ఖాతాల్లోనే జమ చేస్తోంది. త్వరగా ఆర్థిక సాయం అందిస్తుండడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల నమోదు సక్రమంగా జరగకపోవటంతో కొందరు యజమానులకు డబ్బులు పడలేదు. నీటిలో వాహనం మునిగి ఉన్నప్పటి ఫొటో అడుగుతున్నారు. ప్రవాహానికి కొందరు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోగా.. మరికొందరు పై అంతస్తుల్లో ఉండిపోయారు. నీటిలో ఉన్న వాహనాలను ఫొటోలు తీయలేకపోయారు. వారి వివరాలను అస్తవ్యస్తంగా నమోదు చేశారు. ఫలితంగా ఎక్కువ మంది యజమానులకు ఇళ్లకు డబ్బులు పడ్డాయి కానీ.. వాహనాలకు పడలేదు.

వాహనాలకు ఇస్తే మంచిది



శివాలయం వీధిలో ఉంటాం. వరదల వల్ల వారం రోజుల పాటు ఇంటి పైనే ఉండి పోయాం. ఎలాంటి పనులు లేవు. వరద తగ్గిన తర్వాత చూస్తే.. మా ఆటో ఎందుకూ పనికి రాకుండా పోయింది. మొదటి అంతస్తులో ఉండటంతో రూ.10వేలు ఇచ్చారు. ఆటోకి జరిగిన నష్టం ఇవ్వాలి. **- భాస్కరరావు, అజిత్‌సింగ్‌నగర్ శివాలయం వీధి**

వీధిలో పది మందికి నగదు జమ



అజిత్‌సింగ్‌నగర్ పైపులరోడ్డులో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటాం. వరదతో ఇల్లు మునిగిపోయింది. రెండు మంచాలు, రెండు దివాన్లు, వాషింగ్‌మెషిన్, బీరువా అన్నీ పాడైపోయాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. రూ.25వేలు ఇచ్చారు. మా వీధిలో మరో 10 మంది వరకు.. నగదు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. **- భాస్కరరావు, సీపీఐ నాయకుడు**

ఇంటికి రూ.25వేలు ఇచ్చారు



సెప్టెంబరు ఒకటో తేదీన పావుగంట వ్యవధిలో 5 అడుగుల ఎత్తులో వరద ముంచెత్తింది. మా ఇల్లు 6 అడుగుల ఎత్తులో ఉన్నా.. 11 అడుగుల వరకు నీరు వచ్చింది. వస్తువులన్నీ పనికి రాకుండా పోయాయి. కట్టుబట్టలతో మిగిలాం. ఫైనాన్స్‌లో తీసుకున్న ట్రావెల్స్ నడిపే కారు, 2 ద్విచక్ర వాహనాలు నీటిలో మునిగిపోయాయి. వాహనాల ఫొటోలు తీయకపోవడంతో నష్టం వివరాలు నమోదు చేయలేదు. ఇంటికి నష్ట పరిహారం కింద రూ.25వేలు వేశారు.
- పోతులూరి ఆదిలక్ష్మి, ఇందిరానాయక్‌నగర్

వాహనానికీ డబ్బులు వేశారు



అజిత్‌సింగ్‌నగర్ లూనా సెంటరులో ఉంటాం. వరద ముంచెత్తటంతో ఇల్లు పూర్తిగా మునిగిపోయింది. సామాను, బడ్డీ కొట్టు పూర్తిగా పనికి రాకుండా పోయింది. ద్విచక్రవాహనం నీటిలోనే ఉండిపోయింది. ఉన్నఫళంగా పడవల్లో బయటకు వచ్చి.. బంధువుల ఇంట్లో తలదాచుకున్నాం. పరిహారం కింద.. నష్టపోయిన ఇంటికి రూ.25వేలు, వాహనానికి రూ.3వేలు వేశారు. బడ్డీకొట్టు అంచనా వేయలేదు.
- చల్లగాలి దుర్గ, అజిత్‌సింగ్‌నగర్

వంద రోజుల పాలనపై హర్షాతిరేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, మహిళలు, కార్యకర్తలు

దుర్గాఅగ్రహారం (సీతారాంపురం), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు స్థానిక 25వ డివిజన్ దుర్గా అగ్రహారంలో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వంద రోజుల్లో సాధించిన విజయాలపై ప్రజలకు నాయకులు వివరించారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డివిజన్ అధ్యక్షుడు మాచర్ల గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి ఇనుకుల సాయిబాబు, మహిళా నాయకురాలు మాచర్ల పావని, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

బాధితుల నమోదులో లోపాలు సరిదిద్దండి

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : వరద బాధితులకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం అందక గందరగోళం నెలకొందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి. హెచ్. బాబూరావు పేర్కొన్నారు. సచివాలయాల వద్ద బాధితులు అధికారులను నిలదీస్తున్నారని.. వారికి సమాధానం ఇచ్చే వారే కరవయ్యారని విమర్శించారు. గురువారం అజిత్‌సింగ్‌నగర్, సుందరయ్యనగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. బాధితుల నమోదులో లోపాలను అడిగి తెలుసుకున్నారు. అద్దెకు ఉన్నవారు ఇల్లు మారినపుడు మ్యాపింగ్ కాలేదని.. వారి పేర్లు నమోదు చేయలేదని చెప్పారు. కొన్ని చోట్ల కింద అంతస్తుల్లో ఉన్నా.. పై అంతస్తుల్లో ఉన్నారంటూ నమోదు చేసి రూ.10వేలు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. కొంత మంది ఇళ్లకు పరిహారం అందించి.. ఆటోలు, కార్లకు ఇవ్వలేదని పేర్కొన్నారు. తోపుడు బళ్లు, బడ్డీ కొట్లు, విధుల్లోని మున్సిపల్ కార్మికుల పేర్లు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చాలా మంది ఉపాధి లేక.. కుటుంబం గడిచే మార్గం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వారికి సాయం చేయాలని కోరారు. నష్టానికి అనుగుణంగా కుటుంబాలకు, సంస్థలకు ప్రత్యేక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో సీపీఎం నాయకులు బి.రమణారావు, శివ, నిర్మల, శ్రీను, పీరు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న బాబూరావు

మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌కు సన్మానం



బంగార్రాజును సత్కరిస్తున్న వాసుదేవరావు. పక్కన రమణ, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నియమితులైన కర్రోతి బంగార్రాజును విజయవాడ తూర్పు కాపు సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన బంగార్రాజు.. తెదేపా నెల్లిమర్ల ఇన్‌ఛార్జిగా ఉన్నారు. గురువారం ఆయన విజయవాడకు రాగా.. శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. తెదేపాకు అందించిన సేవలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంచి పదవి ఇచ్చారని విజయవాడ తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహంతి వాసుదేవరావు కొనియాడారు. కాపుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నడిమింటి రమణ, గొర్లె కోటేశ్వరరావు, పిన్నింటి శ్రీనివాసరావు, పొట్నూరు కనకారావు, పిన్నింటి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన దుర్గా మణికార్తీక్ (15) బుధవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదంటూ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మణికార్తీక్ పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం యధావిధిగా బడికి వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, బాలస్వామి, సీతారామయ్య తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణదేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో యడ్లపల్లి సీతారామయ్య వెల్లడించారు. గురువారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రతి రోజు అమ్మవారికి వివిధ అలంకారాలతో చండి హోమం, రుద్రహోమాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లి బండ్ల బాలస్వామి, ప్రధాన పూజారి రాము, ఎన్.చంద్రశేఖర్, మురళీ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుల నేతృత్వంలో విజయవాడ అన్ని రంగాల్లో దూసుకుపోతోందని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. గురువారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ముగింపు వేడుకలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర.. 2047 లక్ష్యంగా ముందుకు వెళ్లటం అభినందనీయమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ చంద్రబాబునాయుడు సమపాళ్లలో ప్రజలకు అందిస్తారని తెలిపారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లామని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. నగరపాలకసంస్థ వార్డ్ ప్రత్యేకాధికారి మతీన్, ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, తెదేపా డివిజన్ అధ్యక్షుడు చింతా దుర్గారావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పూజలకు పిలుపునివ్వడం హాస్యాస్పదం

గాంధీనగర్: కల్తీ లడ్డూ వ్యవహారంలో అడ్డంగా దొరికి తిరుపతిని భ్రష్టుపట్టించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పూజల్లో పాల్గొనాలని పిలుపునివ్వడం హాస్యస్పదమని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఐదేళ్ల వైకాపా పాలనలో తిరుమల కొండను వ్యాపార కేంద్రంగా మార్చారని విమర్శించారు. డిక్లరేషన్ ఇవ్వకుండా జగన్ తిరుమలలో అడుగుపెట్టడానికి వీలేదన్నారు.



రాధానగర్ జూనియర్ కళాశాలలో రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు



ఫొటో, వీడియో గ్రాఫర్లకు నిత్యావసరాలు అందిస్తున్న సంఘ సభ్యులు

దాతల చేయూత.. బాధితులకు బాసట

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. నష్టపోయిన విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ రాత పుస్తకాలు పంపిణీ చేసింది. రాధానగర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా వీటిని అందించారు. ప్రిన్సిపల్ ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు సి. హెచ్.వెంకటేశ్వరరావు, టి.కుమారస్వామి, బి.మాధవ్, షణ్ముఖ, వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే.. ఫొటో/వీడియో గ్రాఫర్లకు అజిత్‌సింగ్‌నగర్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. వరదల కారణంగా ఫొటోగ్రఫీ దాని అనుబంధ వృత్తులకు చెందిన 130 కుటుంబాలు నష్టపోయాయి. వీరికి బియ్యం, నిత్యావసరాలను అధ్యక్షుడు ఎ.రవికుమార్, మాజీ అధ్యక్షుడు పి.కోటిరెడ్డి, మాదాల రమేష్, రాము తదితరుల చేతుల మీదుగా అందించారు.

పేద కళాకారులను ఆదుకోవాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : పేద కళాకారులను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని సాయి హృదయ కళానాట్య మండలి వ్యవస్థాపకుడు అగురు త్రినాథ్ నాయుడు కోరారు. నగరంలో వరద బాధితులైన పేద కళాకారులకు పౌరాణిక రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ చేశారు. గురువారం కౌతాకళా వేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బుడమేరు వరద కారణంగా పేద కళాకారులు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దాతలైన గుడివాడ కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు బి.రామ్మోహనరెడ్డి, సీనియర్ రంగస్థల నటీమణి అమ్ముల సువర్ణ సహకారంతో 60 మందికిపైగా కళాకారులకు నిత్యావసరాలు, దుప్పట్లు, దుస్తులు, ప్లేట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుమ్మడి జీవన్‌కుమార్, పోట్రు ఆంథోని, బొత్స సూర్యనారాయణ, కొమ్మూరి నాగేశ్వరరావు, బి.ఆంజనేయులు, సంపర చిన్నారావు, రమణయ్య, జక్కంపూడి సదాశివరావు, సాల్మన్‌రాజు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాల పంపిణీలో త్రినాథ్‌నాయుడు, సువర్ణ తదితరులు

సంఘాల సహకారం మరువలేం

చుట్టుగుంట, న్యూస్‌టుడే: చుట్టుగుంటలోని ఈస్ట్ లయన్స్ క్లబ్ హాల్‌లో వరదల్లో నష్టపోయిన 200 మంది ప్రింటింగ్ వర్కర్ల కుటుంబాలకు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులు, దుప్పట్లు తదితర వస్తువులతో కూడిన కిట్లను గురువారం విజయవాడ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సాంబశివరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని ప్రాంతాల్లోని సంఘాల సభ్యులు ఎంతో సహకరించారన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నరు డి.గోపీనాథ్, ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీటీ మల్లేశ్వరరావు కార్యదర్శి వెలగా శ్రీనివాస్, ఈస్ట్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.హనుమయ్య, కోశాధికారి బీవీ రమణ, పలు జిల్లా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న సాంబశివరావు, హనుమయ్య తదితరులు

డైనమిక్ స్కూల్ అవార్డుకు ఎంపిక

కానూరు, న్యూస్‌టుడే : పోరంకి రవీంద్ర భారతి గ్రీన్ స్కూల్‌కు ఎడ్యుకేషన్ టుడే సంస్థ ప్రతిష్ఠాత్మకమైన డైనమిక్ స్కూల్ అవార్డును అందజేసింది. గురువారం ఆ సంస్థ ప్రతినిధులు పాఠశాలలో ఈ అవార్డును అందజేశారు. పాఠశాల ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో విద్యను అభ్యసించాలన్న ఆలోచనను ఆవిష్కరించడం వల్ల ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి సంపూర్ణ విద్యను అందించడంలో నిబద్ధతను చూపడం, డైనమిక్ లెర్నింగ్‌ను మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా అందించడం కూడా దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతిలను ఎడ్యుకేషన్ టుడే ప్రతినిధులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న రవీంద్ర భారతి గ్రీన్ స్కూల్ ప్రతినిధి

ఉప ముఖ్యమంత్రి దీక్షకు సంఘీభావం

కార్మికపురం (సీతారాంపురం), న్యూస్‌టుడే: తిరుమలలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారానికి ప్రాయశ్చిత్తంగా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్షకు స్థానిక 25వ డివిజన్ అధ్యక్షుడు జిడగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం కార్మికపురం కూర్మయ్య వంతెన వద్ద గల శివాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ దీక్షకు సంఘీభావంగా ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. భాజపా నగర నాయకుడు నాగలింగం శివాజీ, జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షుడు కామళ్ల సోమనాథం, జిడగం మహాలక్ష్మి, ధార్మిక మండలి సభ్యురాలు శానంపూడి శిరీష తదితరులు పాల్గొన్నారు.



ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలుపుతున్న జనసేన డివిజన్ నాయకులు

అభిమానుల సేవలు అభినందనీయం

గాంధీనగర్, న్యూస్‌టుడే : బుడమేరు వరద బాధితులను ఆదుకోవడంలో నందమూరి అభిమానుల సేవలు అభినందనీయమని అమరావతి బహుజన ఆత్మగౌరవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య అన్నారు. ముంపు బాధితుల సహాయార్థం నందమూరి ఫ్యాన్స్.కామ్ రామకృష్ణ సౌజన్యంతో గురువారం ప్రెస్ క్లబ్‌లో గృహోపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వరదల్లో మోకాళ్లలోతు నీళ్లలో 75 సంవత్సరాల వయసులోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితులకు నేను ఉన్నానంటూ భరోసా ఇవ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇలా చేయలేదని పేర్కొన్నారు. అమెరికా, లండన్, జర్మనీ నుంచి కూడా సహాయం అందించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. దేశ, విదేశాల నుంచి ఫ్యాన్స్ సభ్యుడు రామనాథం నేతృత్వంలో బాధితులను ఆదుకోవడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. 23 కుటుంబాలకు కుక్కర్లు, గ్రైండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చలసాని శివరామకృష్ణ, గూడపాటి పద్మశేఖర్, మాదిగాని గురునాథం, సింగంశెట్టి నాగేంద్రరావు, కనకం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గృహోపకరణాలు పంపిణీ చేస్తున్న బాలకోటయ్య, నారాయణరావు, రామనాథం, శివరామకృష్ణ

హక్కుల సాధనకు పోరాటం

గాంధీనగర్, న్యూస్‌టుడే : విద్యార్థుల హక్కుల కోసం పీడీఎస్‌యూ 50ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తోందని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ అన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ 50సంవత్సరాల లోగో, పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.రఫీ, విశ్రాంత ఆర్ఐవో రాజారావు పాల్గొన్నారు.

ఏసీ కాజేసిన డెలివరీ బాయ్

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : డోర్ డెలివరీ చేయాల్సిన ఏసీని.. తన ఇంట్లోనే పెట్టుకుని వాడుకుంటున్నాడో వ్యక్తి. సత్యనారాయణపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గాంధీనగర్‌లోని జి.ఎన్.ఎస్. కొరియర్ కంపెనీకి హైదరాబాద్ నుంచి రూ.52 వేల విలువైన ఏసీని తెనాలికి ఒక వ్యక్తి పంపారు. దానిని అదే కంపెనీలో పనిచేస్తున్న డెలివరీ బాయ్.. ఆర్.సాయిరామ్ దొంగిలించాడు. రామకృష్ణాపురంలోని తన ఇంట్లో అమర్చుకున్నాడు. కొరియర్ నిర్వాహకులు సీసీ కెమెరా ఫుటేజ్‌లు పరిశీలించగా.. విషయం వెలుగుచూసింది. సాయిరాంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి ఏసీని గురువారం స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

మాచవరం, న్యూస్‌టుడే: యునైటెడ్ కాలేజ్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, సహాయక సేవలను అందిస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాచవరంలోని యునైటెడ్ కాలేజ్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక నైపుణ్యంలో బ్యాచులర్స్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసి వివిధ దేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, కళాశాల కరస్పాండెంట్ అబ్దుల్ రజాక్, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు, అతిథులు

రాష్ట్రాన్ని వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కృష్ణలంక, న్యూస్‌టుడే : ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారిస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాలా భారత్‌కు ఓ కీలక వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణాంధ్రజీ2047 దార్శనిక పత్రాన్ని రూపొందిస్తోందని సీపీవో వై.శ్రీలత తెలిపారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం ఆమె ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు వివిధ భాగస్వామ్య పక్షాలతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పటమట, న్యూస్‌టుడే : సైబర్ నేరాలపై సచివాలయ మహిళా పోలీసులు అవగాహన కలిగి ఉండాలని, దీనిపై ప్రజలను చైతన్య పరచాలని సీఐలు పవన్ కిషోర్, జానకీ రామయ్య అన్నారు. గురువారం పటమట పోలీస్ స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని వార్డు సచివాలయ మహిళా పోలీసులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఎస్సై రేవతి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సొరంగం దుర్గంధం



2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో వేసిన రంగులు



వైకాపా పాలనలో పర్యవేక్షణ లేక ఇలా వెలిసిపోయి..

విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు 2018 సంవత్సరంలో నగరంలో సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా వన్‌టౌన్‌లోని సొరంగం గోడలకు రంగులు వేశారు. విద్యుద్దీపాలు అమర్చారు. పాదచారుల బాటను చక్కగా తీర్చిదిద్దారు. అందంగా ముస్తాబు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ పాలనలో పట్టించుకోలేదు. నిర్వహణను గాలికివదిలేసింది. గోడలకు చిల్లులు ఏర్పడ్డాయి. నీరు లీకేజ్ అవుతూ.. ప్రయాణికుల మీద పడుతున్నాయి.



యాచకులకు అడ్డాగా..



గోడల్లో నీరు లీకై అపరిశుభ్రంగా..

రంగులు వెలిసిపోయి పాడైపోయాయి. గోడలన్నీ పాచిపట్టాయి. దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి సొరంగానికి పూర్వ వైభవం తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

– ఈనాడు, అమరావతి

తక్షణం దిగిపోండి.. రెండేళ్లు అవకాశం ఇవ్వండి

విజయ డెయిరీ ఛైర్మన్ వ్యవహారం ● విజయవాడలో నేతల కీలక సమావేశం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

విజయ డెయిరీ ఛైర్మన్ మార్పు వ్యవహారం రసకందాయంలో పడింది. ప్రస్తుత ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెదేపాకు విధేయుడిగా, ప్రత్యక్ష రాజకీయాల్లో పని చేయలేదంటూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన్ను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ పెద్దలు ఇప్పటికే సూచించిన సంగతి తెలిసిందే. ఈ నెల 30 లోగా రాజీనామా చేయవలసిందిగా చలసానికి గడువు కూడా విధించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. కానీ బుధవారమే ఆంజనేయులు రాజీనామా చేస్తారని అందరూ భావించినా, డైరెక్టర్ల అత్యవసర సమావేశంలో సీఎం చంద్రబాబుని కలిసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలంటూ తీర్మానించడంతో వ్యవహారంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలో గురువారం విజయవాడలోని ఓ హోటల్‌లో మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని), కృష్ణాజిల్లా తెదేపా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, చలసాని ఆంజనేయులు, విజయ డెయిరీ డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ఛైర్మన్ పదవి నుంచి ఆంజనేయుల్ని తప్పించాలన్నది అధిష్ఠానం నిర్ణయమని, దీని ప్రకారమే అందరూ నడుచుకోవాలని మంత్రి, ఎంపీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రతికూల ప్రభుత్వం, కరోనా సమయంలో ఆంజనేయులు ఆధ్వర్యంలో డెయిరీ పురోగతి సాధించిందని, వీరవల్లిలో అధునాతన యూనిట్‌ను కూడా నిర్మించుకోగలిగామని, మరో రెండేళ్లయినా ఆయన్ను కొనసాగించాలంటూ కొందరు డైరెక్టర్లు విజ్ఞప్తి చేశారు. పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ కట్టుబడి ఉండాలని, తక్షణం చలసాని పదవి నుంచి వైదొలగాల్సిందేనని నేతలు స్పష్టం చేశారు. పార్టీ జెండా పట్టుకుని ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనవద్దని ఆంజనేయులుకు తామే సూచించామని, మండవ జానకిరామయ్య తరహాలోనే రాజకీయాలకతీతంగా యూనియన్‌ను నడపాలన్న విషయం చెప్పామని, అంతే తప్ప ఆంజనేయులు తెదేపాకు వ్యతిరేకంగా ఎక్కడా వ్యవహరించ లేదంటూ డైరెక్టర్లు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. ఆంజనేయులు మాత్రం చంద్రబాబు కారణంగానే తనకు పదవి వచ్చిందని, ఆయన చెబితే రాజీనామా చేయడానికి సిద్ధమంటూ అన్నట్లు సమాచారం. డైరెక్టర్ల అభిప్రాయాలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పి నేతలు సమావేశాన్ని ముగించారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరానికి వినోదం కావాలె..!



అమ్మ..	ఇంటి పనుల్లో తలమునకలవుతోంది..
నాన్న..	బరువు బాధ్యతల్లో మునిగితేలుతున్నాడు..
పిల్లలు..	పుస్తకాలతో కుస్తీపడుతున్నారు..
యువత..	ప్రపంచంతో పోటీ పడుతున్నారు..
ఉద్యోగి..	పని ఒత్తిడితో చిత్తవుతున్నాడు..

ఇలా.. అందరూ రోజువారి దినచర్యలో పడి... ఆహ్లాదానికి దూరమైపోతున్నారు. అన్ని వర్గాల ప్రజల మానసిక వికాసానికి పర్యాటక రంగం ఎంతో తోడ్పడుతుంది. ఈ రంగాన్ని గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

- భవానీపురం, న్యూస్‌టుడే

సేదతీరే వనాలు అవసరం | దర్శనీయ ప్రదేశాలపై దృష్టిపెట్టాలి.. | ప్రపంచ పర్యాటక దినోత్సవం నేడు

ద్వీపాన్ని అద్వితీయంగా తీర్చిదిద్దాలి..

విజయవాడ నగరం చెంత కృష్ణా నదిలోని భవానీద్వీపం సహజ సిద్ధమైనది. దీని అభివృద్ధికి నాటి తెదేపా ప్రభుత్వ హయాంలో అంకురార్పణ చేశారు. అమరావతి రాజధాని బృహత్ ప్రణాళికలో భాగంగా.. ప్రత్యేకంగా బీఐటీఎస్(భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్)ను ఏర్పాటు చేశారు. రూ.12 కోట్ల వ్యయంతో నది ఒడ్డున లేజర్‌షో, వాటర్ ఫౌంటెన్‌లు వంటివి ఏర్పాటు చేశారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ గత వైకాపా ప్రభుత్వం.. వాటిని పక్కనెట్టింది. స్తూపం దెబ్బతిన్నా పట్టించుకోలేదు. 2019లో వరదలతో పాడైన ఫౌంటెన్, లేజర్‌షోలను మరమ్మతులు చేయలేదు. ఫౌంటేన్‌కు బీమా సదుపాయం ఉందని అధికారులు చెప్పినప్పటికీ.. మిన్నకుండిపోయింది.



తాళ్లపై సాహసం..



ప్రకాశం బ్యారేజీ సమీపంలో కృష్ణానదిపై రోప్‌వే నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. గతంలో పలు పర్యాయాలు అంచనాలు రూపొందించారు. తర్వాత విస్మరించారు. తొలుత ఇంద్రకీలాద్రి మీద నుంచి భవానీద్వీపానికి రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి దేవస్థానం అధికారుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. పున్నమి ఘాట్ నుంచి కృష్ణానదిపై నిర్మించాలని సంకల్పించారు. భవానీద్వీపంతో పాటు కొండపల్లి కోటకు రోప్‌వే నిర్మిస్తామని పర్యాటక శాఖ అధికారులు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల్లో కదలిక తీసుకురావాలి.

పూర్వవైభవం తేవాలి..





ఎన్టీఆర్, కృష్ణాజిల్లా పరిధిలో అనేక పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. విజయవాడ నగరానికి సమీపంలోనే కొండపల్లి ఖిల్లా ఉంది. గత ప్రభుత్వం దీని అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. గాంధీహిల్‌ను పూర్తిగా విస్మరించారు. మచిలీపట్నం బీచ్, కాటేజీల నిర్మాణం, సందర్శకుల సౌకర్యాలపై ప్రతిపాదనలను పక్కన పడేశారు. పవిత్ర సంగమం, ఇబ్రహీంపట్నంలో బటర్‌ఫ్లై ఉద్యానాలను విస్మరించారు. నగర పరిధిలో బాపు మ్యూజియాన్ని సందర్శకులు రాకుండా చేశారు. మ్యూజియం ప్రవేశ రుసుం రూ.50లు చేయడంతో... సందర్శకులు తగ్గిపోయారు. 2014-19 తెదేపా హయాంలో నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారిని ఆకర్షించేలా కృష్ణానదిపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎఫ్1 హెచ్2వో బోట్ల పోటీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ఎయిర్‌షో, నావికా దళ సిబ్బంది విన్యాసాలు అలరించాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

రాజధాని నగరమైన విజయవాడలో మరిన్ని పర్యటక ప్రాజెక్టులు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రజలు సేదతీరేందుకు ఉద్యానాలు పెంచాలి. వినోద కార్యక్రమాలు పెరగాలి. ఉద్యోగులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందే.. ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పాలి. పిల్లలు, పెద్దలు.. ఇలా అన్ని వర్గాల మానసిక వికాసాన్ని కలిగించే రకరకాల ఆటలు ఉండాలి. మరుగునపడిన పర్యటక ప్రాంతాలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాణిపాకం వినాయకుడికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, ఏఈవో వెంకటరెడ్డి, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక దేవస్థానం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను గురువారం సమర్పించారు. దుర్గగుడి ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, ఏఈవో వెంకటరెడ్డి పర్యవేక్షణలో వైదిక కమిటీ సభ్యుల బృందం పట్టు వస్త్రాలు, సారె తీసుకు వెళ్లారు. కాణిపాక దేవాలయ అధికారులు మేళతాళాలతో వారికి స్వాగతం పలికారు. దేవస్థానం ఈవో గురుప్రసాద్‌కు పట్టువస్త్రాలు, సారె అందజేశారు. కాణిపాకం దేవస్థాన వేద పండితులు కమిటీ సభ్యులకు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేశారు.

భారీ ర్యాలీగా మంగళగిరికి

జగ్గయ్యపేట: వైకాపాకు రాజీనామా చేసి జనసైనికుడిగా మారిన మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను జగ్గయ్యపేటలోని ఆయన అభిమాన శ్రేణుల నుంచి మద్దతు లభించింది. గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరేందుకు జగ్గయ్యపేట నుంచి వాహనాల్లో అభిమానులు, నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మధ్యాహ్నం జగ్గయ్యపేటలోని ఉదయభాను ఇంటి వద్ద నుంచి ఆయన కుమారులు సామినేని వెంకట కృష్ణప్రసాద్, ప్రశాంత్‌బాబులతో పాటు ముఖ్యనాయకులు తరలివెళ్లారు. తనకు మద్దతు పలికిన నాయకులు, శ్రేణులు, కార్యకర్తలందరికీ ఉదయభాను కృతజ్ఞతలు తెలియజేశారు.



అభిమానుల ప్రదర్శన

కార్పొరేషన్ ఛైర్మన్లకు అభినందన

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.సత్యనారాయణ, హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బి. తాతయ్యబాబు గురువారం మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను ఆయన నివాసంలో మరాద్యపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నియమించిన ఛైర్మన్లు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని వెంకన్న సూచించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలంకారీ కార్పెట్ల అందాలు

పెడనలో తయారీ.. వరంగల్‌లో విక్రయం

న్యూస్‌టుడే, పెడన



ప్రింటింగ్ చేస్తున్న కార్మికుడు

కలంకారీ కార్పెట్లు భౌగోళిక గుర్తింపు పొందాయి. వరంగల్‌లో మగ్గాలపై రూపుదిద్దుకునే ఈ కార్పెట్లను పెడన తీసుకొచ్చి కలంకారీ ప్రింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దుతారు. కలంకారీ ప్రింటింగ్ పూర్తయిన వాటిని తిరిగి వరంగల్ పంపిస్తారు. అక్కడి నుంచి దేశ విదేశాలకు ఎగుమతులు జరుగుతాయి.

కలంకారీ కార్పెట్లకు వరంగల్‌లోని కొత్తవాడలో కొన్ని కుటుంబాలు మగ్గాలపై రూపుదిద్దుతారు. వివిధ సైజుల్లో వచ్చే ఈకార్పెట్లను అక్కడి ఉత్పత్తిదారులు కలంకారీ ప్రింటింగ్ నిమిత్తం పెడనకు పంపిస్తారు. ఇక్కడ కార్పెట్లను ప్రత్యేకంగా ప్రింటింగ్ చేసే కుటుంబాలు కలంకారీ హస్తకళగా మార్చి మార్కెటింగ్‌కు సిద్ధం చేస్తారు. దేశ విదేశాల్లో జరిగే ఎగ్జిబిషన్లలో కలంకారీ కార్పెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇక్కడి కళాకారుల నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తాయి. అయితే శ్రమతో కూడిన ఈ ప్రింటింగ్‌ను చేసే కార్మికులు పెడనలో ఏటికేడాది తగ్గిపోతున్నారు. గతంలో వందల సంఖ్యలో కార్మికులు ఉండగా ప్రస్తుతం పదుల సంఖ్యకు తగ్గారు.

ఇంటీరియర్ డెకరేటర్‌గా..



కలంకారీ కార్పెట్లను ఇంటీరియర్ డెకరేటర్‌గా వినియోగిస్తారు. ఇంటీరియర్ డిజైనర్లు ఈ కార్పెట్లను వినియోగించడంలో ఆసక్తిని చూపిస్తున్నారు. వివిధ సైజుల్లో అందుబాటులో ఉన్న వీటిని ఇంటిలోపలి అందాలను మరింతగా ఇనుమడింప చేస్తున్నాయి. ప్రకృతి సిద్ధమైన రంగులైన కరక్కాయ, నల్లబెల్లం, మోదుగుపువ్వు, దానిమ్మ బెరడులతో రూపుదిద్దుకుంటూ హస్తకళా ప్రియుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బెంగళూరు, దిల్లీ, హైదరాబాద్, చెన్నై తదితర నగరాల్లోని ప్రధాన హస్తకళా షోరూంల్లో వీటిని విక్రయాలకు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ హస్తకళల అభివృద్ధి సంస్థలైన లేపాక్షి, గోల్కొండ షోరూముల్లో కూడా ప్రముఖంగా విక్రయిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైలు ప్రయాణికులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా ప్రచారంలో భాగంగా విజయవాడ డివిజన్ వ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, రైళ్లలో ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడొద్దని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతలో లోపాలు ఉంటే ప్రయాణికులు 139లో ఫిర్యాదు చేయాలని కోరారు. అధికారులు విజయవాడ రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాంట్రీ కార్లు, క్యాంటీన్లు, స్టాళ్లు, క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విక్రయదారుల గుర్తింపు కార్డులు పరిశీలించారు.



ఆహారపదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రసాదాల నాణ్యతపై పర్యవేక్షణ ఏది?

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే



టెండర్ విధానంలో లోపాలు | ధర తక్కువకే ప్రాధాన్యం

ఆలయంలో తయారవుతున్న లడ్డూలు

శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లడ్డూ ప్రసాదాల నాణ్యతపై నీలినీడలు అలుముకున్నాయి. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలిసిన నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్వయంగా ఆలయంలోని ప్రసాదం పోటులో ఆకస్మికంగా తనిఖీలు చేసిన విషయం విదితమే. లడ్డూ తయారీలో ప్రధానమైన నెయ్యి, జీడిపప్పు, శెనగపప్పు నాసిరకంగా ఉన్నట్లు ఆయన గుర్తించి వాటిని పరీక్షలకు పంపాలని ఈవోను ఆదేశించారు. గత వైకాపా పాలన ఐదేళ్లలో తిరుపతమ్మ ఆలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం, పాలకవర్గాలు దృష్టి సారించక పోవడంతో లడ్డూ ప్రసాదాల తయారీపై పర్యవేక్షణ కరవైంది.

ఏడాదికి రూ. కోటి విలువైన సరకులు కొనుగోలు

తిరుపతమ్మ దేవాలయానికి ఏడాదికి 50 లక్షల మంది భక్తులు వస్తుంటారు. 12 లక్షల లడ్డూ ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేస్తారు. ప్రసాదాల తయారీ సరకుల కొనుగోలు దేవస్థానం ఏడాదికి రూ. 1.10 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ సరకులను టెండర్ విధానంలో కొనుగోలు చేస్తోంది. కొనుగోలు చేసే పదార్థాల్లో నెయ్యి, జీడిపప్పు, శెనగపిండి, కిస్మిస్, యాలుకలు, లవంగాలు, బియ్యం, పంచదార, ఇతర పదార్థాలు ఉన్నాయి. ప్రసాదాల తయారీ పదార్థాల కొనుగోలు, నిల్వ చేయడం, రోజూ వారి నిర్వహణకు ఒక సూపరింటెండెంట్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పలువురు ఉద్యోగులు పని చేస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

దేవస్థానానికి కావాల్సిన పదార్థాలను టెండర్ విధానంలో కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఏడాది ఒక సారి మాత్రమే టెండర్ పిలిచేవారు, దానిని కొంతకాలంగా 6 నెలలకు కుదించారు. దేవాదాయ శాఖ రూపొందించిన టెండర్ షెడ్యూల్ ప్రకారం టెండర్‌లో పాల్గొనే ఏజెన్సీల్లో ఎవరైతే తక్కువ ధరకు కోడ్ చేస్తే వారికే టెండర్ దక్కుతోంది. మంచి సరకు సరఫరా చేయాల్సి ఉన్నా, తక్కువ ధర కోడ్ చేయడంతో ఏజెన్సీ వారు నష్టపోకుండా ఉండటం కోసం నాసి రకం సరకులు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ కొరవడి

గడిచిన ఐదేళ్లుగా అమ్మవారి దేవాలయానికి రెగ్యులర్ ఈవో లేరు. ఈవోగా ఎవరూ వచ్చినా ఇతర దేవాలయాల్లో విధుల్లో ఉన్నవారినే నియమించడంతో వారు స్థానికంగా ఉండడం లేదు. ఆలయానికి అప్పుడప్పుడు వస్తు పోతున్నారు. కొన్నేళ్లుగా ఈ-ఫైల్ విధానం అమల్లోకి రావడంతో ఆలయానికి రాకుండానే సంతకాలు చేస్తూ పాలన సాగించారు. దేవాలయానికి పాలకవర్గాలు ఉన్నా ఛైర్మన్, సభ్యులకు సరైన అవగాహన లేకపోవడంతో పరిశీలన, పర్యవేక్షణ లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులర్ ఈవోను నియమించాలని ఆలయ ఉద్యోగులు కోరుతున్నారు.

జలవనరుల శాఖలో బదిలీలు

మచిలీపట్నం (కోనేరుసెంటరు): సాధారణ బదిలీలపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో జలవనరుల విభాగంలో పనిచేస్తున్న పలువురు ఈఈలను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో బదిలీ అయిన వారి వివరాలు..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఆర్ అప్పారావు	విస్సన్నపేట పులిచింతల సర్కిల్	జంగారెడ్డిగూడెం, పీఐపీహెచ్‌డబ్ల్యూ డివిజన్ నెం.8
పి.వెంకటేశ్వర్లు	విజయవాడ హైడ్రాలజీ విభాగం	పీఐపీఆర్ఎంసీ డివిజన్ నెం.5, విజయవాడ, ఎన్ఎస్ఎల్‌సీ సర్కిల్
వి.శివరామప్రసాద్	ప్రాజెక్టు డివిజన్‌నెం.2, పులిచింతల సర్కిల్	పీపీ డివిజన్-4 పులిచింతల ప్రాజెక్టు సర్కిల్
వి.కృష్ణారావు	పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు	విశాఖ డీఎస్ఈ
ఆర్ విఠల్‌ప్రసాద్	హైడ్రాలజీ విభాగం, విజయవాడ	కమిషనరేట్ ఆఫ్ టెండర్స్, విజయవాడ
బి.శ్యామ్‌ప్రసాద్	డీసీఈ, కృష్ణాడెల్టా సిస్టమ్స్, విజయవాడ	గుంటూరు హైడ్రాలజీ విభాగం
బి.శ్రీనివాసరావు	నీరు-ప్రగతి, విజయవాడ	పీడబ్ల్యూ వర్క్‌షాప్, సీతానగరం
ఎ.సురేష్	హైడ్రాలజీ విభాగం, విజయవాడ	నీరు-ప్రగతి, విజయవాడ
ప్రసాద్‌రెడ్డి	కమిషనరేట్ ఆఫ్ టెండర్స్, విజయవాడ	ఇరిగేషన్ విభాగం, కడప
కె.రమేష్	ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ	పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ప్రత్యేక అధికారి

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ యువతి రోడ్డుపై పడిపోగా.. లారీ ఎక్కేసింది. అక్కడికక్కడే ఆమె దుర్మరణం పాలైన ఘటన నున్న గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర శివారులోని కండ్రికకు చెందిన షేక్ మరియంబి (20) గన్నవరం మండలం సూరంపల్లిలో డీజే బాక్సులు తయారు చేసే కంపెనీలో పనిచేస్తున్నారు. అదే కంపెనీలో సుంకర వాణి పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం వాణి తన భర్త వాహనంపై ఇంటికి వెళుతూ మరియంబిని ఎక్కించుకున్నారు. బోడపాడు ఆంజనేయ స్వామి గుడి వద్ద లారీని దాటుకుని ముందుకు వెళుతుండగా.. ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. వాణి, మరియంబీలు రోడ్డుపై పడిపోయారు. లారీ మరియంబీపై ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందారు. వాణికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై మృతురాలి భర్త షేక్ సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఇద్దరు స్నేహితుల మృతి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే : రైలు ఢీకొని ఇద్దరు స్నేహితులు మృతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రామవరప్పాడుకు చెందిన మోరం దిలీప్ (17) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడు పట్నాల తేజా పద్మ కళాధర్(19) తో కలిసి బుధవారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. గురువారం ఉదయం రైల్వే సిబ్బంది సమాచారంతో గుడివాడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లడ్డూ కల్తీపై నిరసనలు రేపు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై భక్తుల మనోభావాల పరిరక్షణకు మహాదళ్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నట్లు మహాదళ్ సభ్యుడు గణేష్ మహారాజు తెలిపారు. గురువారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఖరి కారణంగా ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూ వ్యవహారంపై ప్రపంచవ్యాప్తంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలను పూర్తిగా ప్రక్షాళన చేయడంతో పాటు, కల్తీ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం నిరసన కార్యక్రమాల్లో హిందూ సంఘాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో న్యాయవాది రవి, కొర్రబోలు శ్రీనివాసరావు, పోతురాజు, మహాదళ్, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణేష్ మహారాజు. పక్కన రవి, శ్రీనివాసరావు, పోతురాజు

రైలు నుంచి జారిపడి.. తెల్లవార్లూ మృత్యు పోరాటం

రెండు కాళ్లు కోల్పోయిన యువకుడు



సుధాకర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వెళ్లొస్తూ రైలు నుంచి జారిపడి రెండు కాళ్లూ కోల్పోయి రాత్రంతా వర్షంలో తడుస్తూ నరక యాతన పడిన ఓ యువకుడి హృదయవిదారకర సంఘటన ఇది. గుడివాడ రైల్వేస్టేషన్ ప్రాంతంలో నివాసం ఉండే బొమ్మసాని సుధాకర్(40) బుధవారం విజయవాడ వెళ్లి అదే రోజు రాత్రి రైలులో తిరిగి వస్తున్నాడు. రాత్రి 9.30 గంటలకు పట్టణంలోని దనియాలపేట ప్రణవాశ్రమం సమీపంలోకి రాగానే రైలు బోగీ గేటు నుంచి జారిపడి రెండు కాళ్లు మోకాళ్ల కిందకు తెగిపోయాయి. సుధాకర్‌ను రాత్రి ఎవరూ గుర్తించకపోవడం, ప్రయాణికులు, రైల్వే అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి కురిసిన వర్షానికి తడుస్తూనే తీవ్ర రక్తస్రావంతో అంతులేని వేదన అనుభవించాడు. ఉదయం 6 గంటలకు గ్యాంగ్‌మెన్ గుర్తించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు దనియాలపేట వంతెన నుంచి సుమారు కిలోమీటరు దూరం స్ట్రెచర్‌తో తీసుకెళ్లి గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అదే అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు.